

పల్లె వెలుగు

తెలుగు జాతీయ దిన పత్రిక

అవినీతిపై నిఘా

Postal No: 3-78(D)-2026-2028

RNI APTEL 2013/54510

Published From : KURNOOL circulated at Nandyal,Srikakulam,VishakaPatanam,Vijayanagaram,East Godavari ,West Godavari, Krishna, Guntur,Prakasam, Nellore,Chittoor, Kurnool,Kadapa,Anantapuram, Hyderabad

ఎడిటర్ : ఎం. మహేష్ యాదవ్ | సంపుటి -14 | సంచిక - 318 | పేజీలు - 08 | వెల - 05/- | ఆదివారం 15-11-2026



అమరావతి మెగా రైల్వే స్టేషన్ రూట్ ఖరారు..

గంటకు 160 కి.మీ వేగంతో వెళ్లేలా ట్రాక్!

- ఎర్రుపాలెం నుంచి నంబూరు వరకు 58.1 కిలోమీటర్ల మేర కొత్త రైల్వే లైన్
- గంటకు 160 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించేలా ఆధునిక ట్రాక్ నిర్మాణం
- కృష్ణా నదిపై 4.5 కిలోమీటర్ల మేర భారీ ఐకానిక్ వంతెన
- తాడికొండ సమీపంలో అమరావతి ప్రధాన రైల్వే స్టేషన్
- కొప్పరవూరు వద్ద 230 ఎకరాల్లో భారీ రైల్వే టెర్మినల్



ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి రైల్వే కనెక్టివిటీ కల్పించే ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులో కీలక ముందడుగు పడింది. అమరావతి మీదుగా వెళ్లే రైల్వే లైన్ రూట్, రాజధాని ప్రధాన రైల్వే స్టేషన్ ఏర్పాటు చేసే ప్రదేశం, భారీ టెర్మినల్ ప్రాంతాన్ని రైల్వే శాఖ దాదాపు ఖరారు చేసింది. గతంలో రూపొందించిన ప్రణాళికల్లో కొన్ని మార్పులు చేస్తూ తాజా రూపురేఖలను సిద్ధం చేశారు. రాజధాని ప్రాంతానికి పటిష్ఠమైన రోడ్డు, రైలు రవాణా వ్యవస్థను అనుసంధానించడమే లక్ష్యంగా ఈ ప్రాజెక్టును వేగవంతం చేస్తున్నారు.

58.1 కిలోమీటర్ల మార్గం.. గంటకు 160 కిలోమీటర్ల వేగం

ఎర్రుపాలెం (ఖమ్మం జిల్లా), నంబూరు (ఉమ్మడి గుంటూరు జిల్లా) మధ్య నిర్మించనున్న కొత్త రైల్వే కారిడార్ పొడవును గతంలో ప్రతిపాదించిన 56.53 కిలోమీటర్ల నుంచి 58.1 కిలోమీటర్లకు సవరించారు. ఈ మార్గంలో గరిష్ఠంగా గంటకు 160 కిలోమీటర్ల వేగంతో రైళ్లు రాకపోకలు సాగించే విధంగా అత్యంత ఆధునిక సాంకేతికతతో

మిగతా 2లో

రూ.5 లక్షల బీమా, రూ.10 లక్షల వైద్యం

- సంక్షేమ పథకాన్ని రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి కలిసి ప్రారంభం
- ఈ పథకం కింద రూ.5 లక్షల జీవిత బీమా
- రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా రూ.10 లక్షల వరకు ఉచిత వైద్యం
- హైదరాబాద్‌లో జరిగిన సభకు ముందు గిగ్ వర్కర్ల భారీ బైక్ ర్యాలీ
- అనంతరం గిగ్ వర్కర్లతో రాహుల్ ముఖాముఖి



తెలంగాణలో గిగ్ వర్కర్లకు సామాజిక భద్రత కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక అడుగు వేసింది. వారికి రూ.5 లక్షల జీవిత బీమాతో పాటు రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం కింద రూ.10 లక్షల వరకు ఉచిత వైద్య సదుపాయం అందించనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. హైదరాబాద్‌లోని జయభేరీ గ్రౌండ్స్‌లో శనివారం నిర్వహించిన సభలో లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో కలిసి 'తెలంగాణ గిగ్ వర్కర్ల సామాజిక భద్రత, సంక్షేమ పథకం' విధివిధానాలను ఆయన ప్రారంభించారు.

గిగ్ వర్కర్లకు చట్టబద్ధమైన గుర్తింపు

ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. గిగ్ వర్కర్లు కష్టానికి తగిన ఆదాయం పొందలేకపోతున్నారని

మిగతాది 2లో

ఉదయనిధి స్టాలిన్‌కు మద్రాస్ హైకోర్టులో ఎదురుదెబ్బ

- 2026 ఎన్నికల పిటిషన్‌ను కొట్టివేయాలన్న ఉదయనిధి విజ్ఞప్తి తిరస్కరణ
- పిటిషన్‌పై విచారణ కొనసాగిస్తామన్న మద్రాస్ హైకోర్టు
- కౌంటర్ దాఖలు చేయాలని ఉదయనిధికి ఆదేశం



తమిళనాడు శాసనసభలో ప్రతిపక్ష నేత, డీఎంకే కీలక నేత ఉదయనిధి స్టాలిన్‌కు మద్రాస్ హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో చెపాక్-తిరువల్లికేని నియోజకవర్గం నుంచి ఆయన సాధించిన విజయాన్ని సవాలు చేస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది.

గిగ్ వర్కర్లకు అండగా ఉంటాం..

ప్రతి డెలివరీపై 1 శాతం నగదు జమ: రాహుల్ గాంధీ

- తెలంగాణ గిగ్ వర్కర్స్ పాలసీని ఆవిష్కరించిన రాహుల్ గాంధీ
- ప్రతి డెలివరీపై ఒక శాతం మొత్తాన్ని కార్మికుల ఖాతాల్లో జమ చేస్తామని వెల్లడి
- రూ.5 లక్షల ప్రమాద బీమా, పింఛన్, సామాజిక భద్రత కల్పిస్తామని హామీ
- పని, ఆదాయ వివరాలు మొబైల్ ఫోన్లలో అందుబాటులో ఉంటాయని వెల్లడి
- వైఫైతో ప్రత్యేక విశ్రాంతి భవనాలు ఏర్పాటు చేస్తామని హామీ



గిగ్ వర్కర్ల శ్రమకు తగిన ప్రతిఫలం దక్కేలా, వారి హక్కులు, సంక్షేమానికి భరోసా కల్పించడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తెలిపారు. ప్రతి డెలివరీపై ఒక శాతం మొత్తాన్ని కార్మికుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసేలా కొత్త విధానాన్ని తీసుకొచ్చామని వెల్లడించారు. హైదరాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డితో కలిసి తెలంగాణ గిగ్ వర్కర్స్ పాలసీని ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు.

కంపెనీలకే అనుకూలంగా కేంద్ర విధానాలు

మిగతాది 2లో

12 జిల్లాల పోలీసు ఉన్నతాధికారులతో ఎస్ఈసీ సమీక్ష

- తిరుపతి కలెక్టరేట్‌లో 12 జిల్లాల పోలీసు ఉన్నతాధికారులతో ఎస్ఈసీ పునేఠా సమీక్ష
- గ్రామ పంచాయతీలు, పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల భద్రతపై ప్రధాన చర్చ
- ఇటీవల పల్నాడు, రాయలసీమల్లో జరిగిన ఘర్షణల నేపథ్యంలో ముందస్తు చర్యలు



ఆంధ్రప్రదేశ్‌లో జరగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికలు, పెండింగ్‌లో ఉన్న పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ) అనిల్‌చంద్ర పునేఠా ఈరోజు ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. తిరుపతి కలెక్టరేట్‌లో జరిగిన ఈ సమావేశానికి, సమస్యాత్మకంగా గుర్తించిన 12 జిల్లాలకు చెందిన ఐజీలు, డీఐజీలు, ఎస్పీలు హాజరయ్యారు. ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతల

మిగతాది 2లో

అయ్యో పాపం

అనే రోజులు పోయాయి.. చుక్కలు చూపిస్తాం: బొత్స సత్యనారాయణ

- కక్షపూరిత రాజకీయాలు చేసే వారికి భవిష్యత్తులో గట్టిగా బుద్ధి చెబుతామని బొత్స హెచ్చరిక
- రాష్ట్రంలో ప్రస్తుత పరిస్థితుల్లో ఈక్వాలిటీ రాజకీయాలు పనిచేయవని వ్యాఖ్య
- పార్టీ శ్రేణుల ఆలోచనా విధానం మారాలని జగన్‌కు వివరించినట్లు వెల్లడి



విజయనగరం జిల్లాలో నిర్వహించిన వైసీపీ సమావేశంలో మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ కీలక

మిగతాది 2లో

రాజకీయాల్లో పోటీ.. అభివృద్ధిలో సహకారం

- అభివృద్ధి పనుల విషయంలో కేంద్రంతో కలిసి పనిచేస్తామన్న డీకే శివకుమార్
- మోదీతో తనకు సత్సంబంధాలు ఉన్నాయంటూ జరుగుతున్న చర్చలపై స్పందన
- రాజకీయాలను, అభివృద్ధిని వేర్వేరుగా చూడాలని వ్యాఖ్య
- పలు కార్యక్రమాల్లో మోదీతో శివకుమార్ సరదాగా మాట్లాడటంతో రాజకీయ వర్గాల్లో చర్చ
- రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్రం దృష్టికి తీసుకెళ్లాల్సిన అంశాలను ప్రస్తావించానని



తెలంగాణలో 600కు పైగా మెట్ల బావుల గుర్తింపు

- మెట్ల బావుల పరిరక్షణకు ప్రత్యేక ఎస్‌వోపీలు
- జాతీయ స్థాయికి విస్తరించేలా కార్యాచరణ ప్రణాళిక
- త్వరలోనే కేంద్ర హోంశాఖ కార్యదర్శితో కమిషనర్ భేటీ
- భూగర్భ జలాల పెంపే ప్రధాన లక్ష్యం



తెలంగాణలో చెరువుల పునరుద్ధరణకు అమలు చేస్తున్న స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్ (ఎస్‌వోపీ)లను ఇకపై చారిత్రక మెట్ల బావుల (హెవజూఎవశ్రీశ్రీం) పరిరక్షణకు కూడా వర్తింపజేయనున్నట్లు హైడ్రా

మిగతాది 2లో

సీనియర్ నటుడు గిరిబాబు కన్నుమూత



- టాలీవుడ్ లో విషాదం
- అనారోగ్యంతో తుదిశ్వాస విడిచిన గిరిబాబు
- గిరిబాబు వయసు 80 సంవత్సరాలు
- 600కి పైగా చిత్రాల్లో నటించిన గిరిబాబు

తెలుగు చిత్ర పరిశ్రమలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ప్రముఖ సీనియర్ నటుడు గిరిబాబు (80) కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన, ా

రూ.5 లక్షల బీమా, రూ.10 లక్షల వైద్యం



ఆదాయం పొందలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో రాహుల్ గాంధీని కలిసిన గిగ్ వర్కర్లు తమకు చట్టపరమైన రక్షణ, గుర్తింపు లేదని సమస్యలు వివరించారని గుర్తుచేశారు. వారికి న్యాయం చేస్తామని అప్పట్లో రాహుల్ హామీ ఇచ్చారని, ఇప్పుడు ఆ మాట నిలబెట్టుకున్నారని పేర్కొన్నారు.

వివిధ రంగాలకు చెందిన పలువురి అభిప్రాయాలు, సలహాలు తీసుకున్న తర్వాతే ఈ చట్టాన్ని రూపొందించినట్లు తెలిపారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండటమే కాంగ్రెస్ పార్టీ విధానమని రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు.

బైక్ ర్యాలీలో పాల్గొన్న రాహుల్, రేవంత్

సభకు ముందు శిల్పకళా వేదిక నుంచి జయభేరీ గ్రౌండ్స్ వరకు గిగ్ వర్కర్లు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, పలువురు మంత్రులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు.

అనంతరం జయభేరీ గ్రౌండ్స్‌లో రాహుల్ గాంధీ గిగ్ వర్కర్లతో ముఖాముఖి నిర్వహించారు. వారి సమస్యలు, డిమాండ్లను నేరుగా అడిగి తెలుసుకున్నారు.

గిగ్ వర్కర్లకు అండగా ఉంటాం..

ప్రతి డెలివరీపై 1 శాతం నగదు జమ: రాహుల్ గాంధీ

కంపెనీలకే అనుకూలంగా కేంద్ర విధానాలు



గిగ్ వర్కర్లకు సంబంధించిన సమగ్ర సమాచారం ఇప్పటివరకు అందుబాటులో లేదని, తమ శ్రమకు ఎంత ప్రతిఫలం వస్తోందనే విషయంలోనూ స్పష్టత లేదని రాహుల్ గాంధీ అన్నారు. గతంలో వారి సంక్షేమంపై జరిగిన సమావేశంలో ఇచ్చిన హామీని ఇప్పుడు నెరవేరుస్తున్నామని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలు కంపెనీలకు మాత్రమే ప్రయోజనం చేకూర్చేలా ఉన్నాయని విమర్శించారు. గిగ్ వర్కర్లను మోదీ ప్రభుత్వం, ఆర్ఎస్ఎస్ వెట్టిచాకిరీ కార్మికులుగా మార్చాలని చూస్తున్నాయని ఆరోపించారు. వారిని బానిసలుగా మార్చి దోపిడీ చేయాలనుకుంటే సహించేది లేదని స్పష్టం చేశారు. కార్మికులను సేవకులుగా కాకుండా అభివృద్ధిలో భాగస్వాములుగా తీర్చిదిద్దుతామని చెప్పారు.

ఫోన్‌లోనే పని, ఆదాయ వివరాలు

గిగ్ వర్కర్లకు రక్షణ కల్పించడమే కొత్త చట్టం ప్రధాన ఉద్దేశమని రాహుల్ తెలిపారు. ప్రతి డెలివరీకి సంబంధించిన వివరాలు, చేసిన శ్రమ, దానికి లభించే ప్రతిఫలం నేరుగా వారి మొబైల్ ఫోన్లలోనే అందుబాటులో ఉంటాయని చెప్పారు. గిగ్ వర్కర్ల సౌకర్యార్థం వైఫై వసతితో ప్రత్యేక విశ్రాంతి భవనాలు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు.

ప్రమాదాలు, తీవ్రమైన అనారోగ్య సమస్యలు ఎదురైనప్పుడు గిగ్ వర్కర్లు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని రాహుల్ గాంధీ అన్నారు. ఈ పరిస్థితిని అధిగమించేందుకు కొత్త చట్టం ద్వారా రూ.5 లక్షల ప్రమాద బీమా కల్పిస్తున్నట్లు తెలిపారు. పింఛన్, సామాజిక భద్రత, పొదుపు కోసం ప్రత్యేక చర్యలు తీసుకున్నామని చెప్పారు. ప్రతి డెలివరీపై ఒక శాతం మొత్తాన్ని గిగ్ వర్కర్ల బోర్డు ద్వారా నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసేలా ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. కార్మికుల హక్కులు, వారి కుటుంబాల విద్య, వైద్యం, సంక్షేమానికి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

12 జిల్లాల పోలీసు ఉన్నతాధికారులతో ఎస్ఈసీ సమీక్ష

ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణ, నామినేషన్ల ప్రక్రియ, పోలింగ్ సజావుగా సాగేందుకు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై పోలీసు అధికారులతో ఆయన సమగ్రంగా చర్చించారు.

సమీక్ష ముగిసిన అనంతరం పునేఠా మీడియాతో మాట్లాడుతూ కీలక వివరాలను వెల్లడించారు. గతంలో జరిగిన ఎన్నికల అనుభవాలను దృష్టిలో పెట్టుకుని భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. "ఇటీవల జరిగిన ఎన్నికల్లో పల్నాడు నుంచి రాయలసీమ వరకు కొన్ని గొడవలు జరిగాయి. సమస్యాత్మక 12 జిల్లాల ఎస్పీలతో ప్రత్యేకంగా మాట్లాడాం. పంచాయతీ ఎన్నికల సమయంలో మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించాం. నామినేషన్ల సమర్పణకు ఎవరైనా ప్రత్యేక ఎస్కార్ట్ కావాలంటే కల్పిస్తాం. దాడి ముప్పు ఉందని ఎస్పీకి చెబితే.. అభ్యర్థులకు ప్రత్యేక భద్రత కల్పిస్తారు" అని ఎస్ఈసీ అనిల్‌చంద్ర పునేఠా స్పష్టం చేశారు.

గత ఎన్నికల్లో చోటుచేసుకున్న ఘర్షణలు పునరావృతం కాకుండా క్షేత్రస్థాయిలో కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని పోలీసు యంత్రాంగాన్ని ఎస్ఈసీ ఆదేశించారు. నామినేషన్ దాఖలు చేసే సమయంలో అభ్యర్థులకు ఎటువంటి ఆటంకాలు కలగకుండా చూడాలని, సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఉంచి ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు పూర్తయ్యేలా బాధ్యత తీసుకోవాలని స్పష్టం చేశారు.

సీనియర్ నటుడు గిరిబాబు కన్నుమూత

ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ నేడు తుదిశ్వాస విడిచారు. ఆయన మృతితో టాలీవుడ్ పరిశ్రమలో విషాద ఛాయలు అలముకున్నాయి. గిరిబాబు పూర్తి పేరు యర్రా శేషగిరిరావు. ఆయన 1946 జూన్ 8న ఉమ్మడి ప్రకాశం జిల్లా రావినూతలలో జన్మించారు. చిన్నతనం నుంచే నాటకాలు, కళారంగంపై ఉన్న ఆసక్తితో ఆయన సినిమా రంగం వైపు అడుగులు వేశారు. 1973లో విడుదలైన 'జగమే మాయ' చిత్రంతో ఆయన నటుడిగా వెండితెరకు పరిచయమయ్యారు. ప్రారంభంలో కథానాయకుడిగా కొన్ని సినిమాలు చేసినప్పటికీ, ఆ తర్వాత ప్రతినాయకుడిగా (విలన్), హాస్య నటుడిగా, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా మారి తనదైన ప్రత్యేక శైలితో ప్రేక్షకుల అభిమానాన్ని చూరగొన్నారు. నాలుగు దశాబ్దాలకు పైగా సాగిన తన సినీ ప్రస్థానంలో గిరిబాబు 600కు పైగా చిత్రాల్లో నటించారు. ఎన్టీఆర్, ఏఎన్ఆర్, కృష్ణ, మోహన్ బాబు వంటి అగ్ర కథానాయకులందరితోనూ కలిసి నటించిన అనుభవం ఆయన సొంతం. 1977లో వచ్చిన పౌరాణిక చిత్రం 'కురుక్షేత్రం'లో దుశ్శాసనుడి పాత్రలో ఆయన చూపిన నటన ప్రేక్షకులకు చిరకాలం గుర్తుండిపోయింది. ఆ తర్వాత జ్యోతి, మెరుపు దాడి, పసివాడి ప్రాణం, బాలగోపాలుడు, హలో బ్రదర్, సిసింద్రి, లిటిల్ సోల్జర్స్, నిన్నే పెళ్లాడతా, చంద్రలేఖ, నువ్వే కావాలి వంటి ఎన్నో సూపర్ హిట్ చిత్రాల్లో వైవిధ్యమైన పాత్రలను పోషించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా కొత్త తరం హీరోల చిత్రాల్లోనూ నటించి మెప్పించారు. మహేశ్ బాబు 'అతడు' చిత్రంలో హీరోయిన్ తండ్రిగా ఆయన చేసిన నటన విశేష ఆదరణ పొందింది. అలాగే గమ్యం, అ ఆ, గీత గోవిందం, డిస్కో రాజా, మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచ్‌లర్, జాతి రత్నాలు వంటి సినిమాల్లో విభిన్న పాత్రలతో చివరి వరకూ ప్రేక్షకులను అలరిస్తూనే ఉన్నారు. గిరిబాబు కేవలం నటుడిగానే కాకుండా దర్శకుడిగా, నిర్మాతగా కూడా పరిశ్రమకు విశేష సేవలందించారు. ఆయన స్వీయ దర్శకత్వంలో 'రణరంగం' (1985), 'ఇంద్రజిత్' (1990), 'నీ సుఖమే నే కోరుతున్నా' (2008) వంటి సినిమాలు తెరకెక్కాయి. అలాగే 'మెరుపు దాడి', 'దేవతలారా దీవించండి' వంటి పలు చిత్రాలకు నిర్మాతగానూ వ్యవహరించారు. గిరిబాబు మరణం పట్ల సినీ ప్రముఖులు, అభిమానులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నారు. గిరిబాబుకు ఇద్దరు సంతానం కాగా, పెద్ద కుమారుడు రఘుబాబు ప్రముఖ కమెడియన్ గా కొనసాగుతున్నారు. చిన్న కుమారుడు బోసుబాబు గతంలో ఓ చిత్రంలో నటించారు. గిరిబాబు అర్ధాంగి శ్రీదేవి 2018లో కన్నుమూశారు.

రాజకీయాల్లో పోటీ.. అభివృద్ధిలో సహకారం

రాజకీయ ప్రత్యర్థులుగా ఉన్నప్పటికీ అభివృద్ధి పనుల విషయంలో కేంద్రంతో కలిసి పనిచేస్తామని కర్ణాటక



ముఖ్యమంత్రి డీకే శివకుమార్ స్పష్టం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో తనకు సత్సంబంధాలు ఉన్నాయంటూ జరుగుతున్న చర్చలపై స్పందిస్తూ.. రాజకీయాలను, అభివృద్ధిని వేర్వేరుగా చూడాలని వ్యాఖ్యానించారు. "రాజకీయాల్లో పోటీ పడతాం.. అభివృద్ధిలో సహకరించుకుంటాం" అని పేర్కొన్నారు.

బెంగళూరులో శుక్రవారం పింక్‌లైన్ మెట్రో ప్రారంభోత్సవం సహా పలు కార్యక్రమాల్లో మోదీతో శివకుమార్ సరదాగా మాట్లాడటం, సన్నిహితంగా మెలగడం రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీసింది. దీనిపై శనివారం మీడియాతో మాట్లాడిన ఆయన.. ఆ సందర్భాలను ఎవరికి నచ్చినట్లు వారు అర్థం చేసుకోవచ్చని అన్నారు. ప్రజాప్రతినిధిగా రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్రం దృష్టికి తీసుకెళ్లాల్సిన అంశాలను ప్రస్తావించానని తెలిపారు.

మేకెదాటు ప్రాజెక్టుకు అవసరమైన అనుమతులు ఇప్పించాలని మోదీని కోరినట్లు శివకుమార్ వెల్లడించారు. ఈ ప్రాజెక్టుకు సుప్రీంకోర్టు ఆమోదం తెలిపిందని, రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు అఖిలపక్ష బృందంతో ఢిల్లీ వెళ్లేందుకు అంగీకరించాయని చెప్పారు. అటవీ, పర్యావరణ అనుమతులు సహా పెండింగ్‌లో ఉన్న అంశాలను పరిష్కరించాలని ప్రధానిని కోరినట్లు తెలిపారు. కస్తూరిరంగన్ నివేదికను తిరస్కరించాలని, మెట్రో ప్రాజెక్టు సమస్యల పరిష్కారానికి సాంకేతిక కమిటీ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు. మెట్రో ప్రాజెక్టు వ్యయంలో రాష్ట్రానికి సమాన వాటా ఇవ్వాలని, బెంగళూరులో 500 కిలోమీటర్ల మేర మెట్రో మార్గాల లక్ష్యాన్ని చేరుకునేందుకు పెండింగ్ అంశాలను త్వరగా పరిష్కరించాలని కోరినట్లు వివరించారు.

డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్ల నిర్మాణంపైనా మోదీతో చర్చించినట్లు చెప్పారు. బెంగళూరు అభివృద్ధి శాఖ మంత్రి కృష్ణ బైరేగౌడతో కలిసి నగర అవసరాలను ప్రధానికి వివరించామన్నారు. ఇతర ప్రాంతాల్లో రహదారులు 18-20 శాతం మేర ఉంటే బెంగళూరులో ఆ వాటా 8 శాతమేనని తెలిపారు. భూసేకరణకు చదరపు అడుగుకు సుమారు రూ.50 వేల పరిహారం చెల్లించాల్సి వస్తోందని, అయినా ఫ్లైఓవర్ల నిర్మాణ వ్యయంలో రాష్ట్రం వాటా భరించేందుకు సిద్ధంగా ఉందని వెల్లడించారు. రాష్ట్ర డిమాండ్లపై అఖిలపక్ష బృందంతో ఢిల్లీకి వెళతానని పునరుద్ఘాటించారు.

ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలపై పూర్తి నివేదిక తీసుకున్న తర్వాత స్పందిస్తానని చెప్పారు. బెలగావిలోని సువర్ణ విధానసౌధ విద్యుత్ బిల్లుల బకాయిలపై మాట్లాడుతూ.. ఉచిత విద్యుత్ అందుకుంటున్న రైతుల బిల్లులూ పెరిగాయని వివరించారు. వాటి మొత్తం రూ.20 వేల కోట్ల నుంచి రూ.30 వేల కోట్లకు చేరిందన్నారు. కరవు కారణంగా రైతులు నీటి ట్యాంకులు నింపేందుకు ఎక్కువ విద్యుత్ వినియోగిస్తున్నారని, పరిస్థితిని సరిదిద్దేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఉదయనిధి స్టాలిన్‌కు మద్రాస్ హైకోర్టులో ఎదురుదెబ్బ

(మొదటి పేజీ తరువాయి)

ఈ ఎన్నికల పిటిషన్‌ను ప్రాథమిక దశలోనే కొట్టివేయాలన్న ఉదయనిధి అభ్యర్థనను న్యాయస్థానం తోసిపుచ్చింది. ఈ పిటిషన్‌పై పూర్తిస్థాయి విచారణ కొనసాగిస్తామని స్పష్టం చేస్తూ, నాలుగు వారాల్లోగా కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని ఉదయనిధిని ఆదేశించింది. తదుపరి విచారణను డిసెంబర్ 11వ తేదీకి వాయిదా వేసింది. ఈ నియోజకవర్గంలో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన పి. మిలానీ ఈ ఎన్నికల పిటిషన్‌ను దాఖలు చేశారు. ఉదయనిధి తన ఎన్నికల అఫిడవిట్‌లో ఆస్తుల వివరాలను సరిగ్గా వెల్లడించలేదని, నామినేషన్ పత్రాల సమర్పణలో అవకతవకలు జరిగాయని మిలానీ ఆరోపించారు. అయితే, ఫలితాలు వెల్లడైన తర్వాత ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం నిర్దేశిత 45 రోజుల గడువు దాటిన తర్వాత ఈ పిటిషన్ వేశారని, అందువల్ల దీనిని కొట్టివేయాలని ఉదయనిధి తరఫు న్యాయవాదులు వాదించారు. కానీ ఫలితాలు ప్రకటించిన రోజును మినహాయించి 45 రోజుల సమయాన్ని లెక్కించాలని, ఆ లెక్కన పిటిషన్ గడువు లోపలే దాఖలైందని న్యాయమూర్తి స్పష్టం చేశారు. 2026 ఎన్నికల్లో ఉదయనిధి స్టాలిన్ 62,992 ఓట్లతో విజయం సాధించగా, ఆయన సమీప ప్రత్యర్థి టీవీకే అభ్యర్థి డి. సెల్వం 55,852 ఓట్లు పొందారు. పిటిషనర్ మిలానీకి 30 ఓట్లు వచ్చాయి. తాజాగా హైకోర్టు తీసుకున్న నిర్ణయంతో ఉదయనిధి ఎన్నిక చెల్లుబాటుపై న్యాయ విచారణ ముందుకు సాగనుంది.

తెలంగాణలో 600కు పైగా మెట్ల బావుల గుర్తింపు

(మొదటి పేజీ తరువాయి)

కమిషనర్ ఏవీ రంగనాథ్ వెల్లడించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మెట్ల బావుల పరిరక్షణ, అవగాహన కార్యక్రమంలో ఆయన ఈ కీలక ప్రకటన చేశారు. ఈ బృహత్తర కార్యక్రమాన్ని భవిష్యత్తులో జాతీయ స్థాయి విధానంగా ముందుకు తీసుకెళ్లే అవకాశాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. హైదరాబాద్ నగరంలో నీటి ఎద్దడి, వరద నియంత్రణ, కరవు నివారణ అంశాలపై వచ్చే మంగళవారం కేంద్ర హోంశాఖ కార్యదర్శితో సమావేశం కానున్నట్లు రంగనాథ్ తెలిపారు. ఈ భేటీలో చెరువుల సంరక్షణతో పాటు ప్రాచీన మెట్ల బావుల పునరుద్ధరణను కూడా ప్రధాన ఎజెండాగా చేర్చనున్నట్లు చెప్పారు. చెరువులతో పోలిస్తే మెట్ల బావులు వికేంద్రీకృత జల వనరులుగా సమాజానికి ఎంతో మేలు చేస్తాయని ఆయన వివరించారు. గతంలో ఆలయాలు, చెరువుల పరిసరాల్లో ఉన్న అనేక మెట్ల బావులు కాలక్రమేణా కనుమరుగయ్యాయని, వాటిని తిరిగి వెలుగులోకి తెచ్చి పునరుద్ధరిస్తే భూగర్భ జల మట్టాలు గణనీయంగా పెరుగుతాయని స్పష్టం చేశారు. ప్రస్తుతం ఎల్ నినో ప్రభావంతో నెలకొన్న నీటి కొరత నేపథ్యంలో ఈ చర్యలు ఎంతో ఆవశ్యకమని ఆయన అభిప్రాయపడ్డారు. ఇప్పటికే హైదరాబాద్ పరిధిలో దాదాపు అంతరించిపోయిన పలు చెరువులను హైడ్రా విజయవంతంగా పునరుద్ధరించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు. అధికారిక లెక్కల ప్రకారం తెలంగాణవ్యాప్తంగా 600కు పైగా, గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 160కి పైగా మెట్ల బావులు ఉన్నట్లు గుర్తించారు. క్షేత్రస్థాయిలో వీటి సంఖ్య మరింత ఎక్కువగా ఉండే అవకాశముంది. కాగా, ఈ సదస్సు సందర్భంగా ఆకర్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ సంప్రదాయ మెట్ల బావుల వారసత్వం, పూర్వకాలపు నీటి సంరక్షణ పద్ధతులపై ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర పర్యావరణ, అటవీ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ మాట్లాడుతూ.. ప్రస్తుత నీటి సంక్షోభం కారణంగా పురాతన నీటి పరిరక్షణ పద్ధతులపై ప్రాధాన్యత పెరిగిందన్నారు. సంప్రదాయ జల వనరుల సంరక్షణకు సంబంధించిన కీలక అంశాలను క్యూర్ (జఖ=జు) చట్టంలో చేర్చినట్లు ఆయన వెల్లడించారు. ప్రాచీన జల వనరులకు జీవం పోయడం ద్వారా నగరంలో నీటి భద్రతను పటిష్ఠం చేయవచ్చని అధికారులు భావిస్తున్నారు.ం

అయ్యో పాపం అనే రోజులు పోయాయి..
చుక్కలు చూపిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

సమావేశంలో మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ కీలక వ్యాఖ్యలు చేశారు. రాబోయే రోజుల్లో కక్షపూరిత రాజకీయాలు చేసే వారికి తగిన రీతిలో సమాధానం చెబుతామని, చుక్కలు చూపిస్తామని గట్టిగా హెచ్చరించారు. గతంలో మాదిరిగా రాజకీయ ప్రత్యర్థులపై అనవసర సానుభూతి చూపిస్తూ 'అయ్యో పాపం' అని వదిలేసే పరిస్థితులు ఇకపై ఉండబోవని బొత్స సత్యనారాయణ స్పష్టం చేశారు. రాష్ట్రంలో వేగంగా మారుతున్న రాజకీయ పరిణామాలను గమనిస్తుంటే, వైసీపీ నాయకులు, కార్యకర్తలు తమ ఆలోచనా విధానాన్ని (మైండ్ సెట్) మార్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఏర్పడుతోందని ఆయన అభిప్రాయపడ్డారు. అందరినీ సమానంగా చూసే రాజకీయాలు ప్రస్తుత వాతావరణంలో ఇకపై పని చేయవేమోనని ఆయన వ్యాఖ్యానించారు. రాష్ట్ర రాజకీయాల్లో ఎదురవుతున్న ప్రస్తుత పరిస్థితులు, పార్టీ వర్గాలు అనుసరించాల్సిన వైఖరిపై తన మనసులోని అభిప్రాయాలను ఇప్పటికే పార్టీ అధినేత జగన్ దృష్టికి తీసుకెళ్లినట్లు బొత్స వెల్లడించారు. కక్షసాధింపు చర్యలను ఇకపై ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు.

అమరావతికి మెగా రైల్వే లైన్

(మొదటి పేజీ తరువాయి)

ఆధునిక సాంకేతికతతో ట్రాక్‌ను నిర్మించనున్నారు. ఈ మార్గంలో కృష్ణా నదిపై సుమారు 4.5 కిలోమీటర్ల పొడవైన అద్భుతమైన ఐకానిక్ వంతెన ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. వీటితో పాటు మొత్తం 32 భారీ వంతెనలు, 92 చిన్న వంతెనలు, రాకపోకలకు ఎలాంటి అంతరాయం లేకుండా 12 రోడ్ ఓవర్ బ్రిడ్జిలు/అండర్ బ్రిడ్జిలు (=నదీ/=ఖదీ) నిర్మించేలా ప్రణాళిక రూపొందించారు.

తాడికొండ సమీపంలో ప్రధాన స్టేషన్.. కొప్పరావూరులో మెగా టెర్మినల్

రాజధాని కోర్ క్యాపిటల్ ఏరియాలో భాగంగా, తాడికొండకు సుమారు 5 కిలోమీటర్ల దూరంలో ప్రధాన అమరావతి రైల్వే స్టేషన్‌ను నిర్మించనున్నారు. దీనితో పాటు సుదూర ప్రాంతాల రైళ్ల నిర్వహణ కోసం కొప్పరావూరు వద్ద దాదాపు 230 ఎకరాల విస్తీర్ణంలో భారీ టెర్మినల్‌ను ప్రతిపాదించారు. 24 ఎల్‌హెచ్‌బీ (=ఖదీ) కోచ్‌లు కలిగిన భారీ రైళ్లను సులభంగా హ్యాండిల్ చేసేలా దీనిని తీర్చిదిద్దనున్నారు. ఈ టెర్మినల్‌లో 9 ప్రధాన ప్లాట్‌ఫామ్‌లు, 6 సైడ్ లైన్లు, రైళ్ల నిర్వహణకు అవసరమైన పిట్ లైన్లు, మరో 12 స్టేబ్లింగ్ లైన్లు ఏర్పాటు కానున్నాయి. ఈ మెయింటెనెన్స్ హబ్, టెర్మినల్ నిర్మాణం కోసం అవసరమైన భూమిని కేటాయించాలని రైల్వే శాఖ ఇప్పటికే ఏపీ సీఆర్‌డీఏ (ూూూ జ=ణూూ) ను కోరింది.

మార్గంలో ఏర్పాటయ్యే స్టేషన్లు

ఈ కొత్త రైల్వే మార్గంలో మొత్తం తొమ్మిది స్టేషన్లు రానున్నాయి. పెద్దపురం, చెన్నారావుపాలెం, గొట్టుముక్కల, పరిటాల, కొత్తపల్లి, వడ్డమాను, అమరావతి, తాడికొండ, కొప్పరావూరు మీదుగా రైలు మార్గం సాగుతుంది. వీటిలో పెద్దపురం, పరిటాల, అమరావతి, కొప్పరావూరు స్టేషన్లను క్రాసింగ్ స్టేషన్లుగా అభివృద్ధి చేయనున్నారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఎర్రుపాలెం, నంబూరు స్టేషన్లను కీలక రైల్వే జంక్షన్లుగా మార్చనున్నారు. ఈ ప్రాజెక్టు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే అమరావతి నుంచి దేశంలోని అన్ని ప్రధాన నగరాలకు వేగవంతమైన, అత్యాధునిక రైల్వే రవాణా సదుపాయం లభించనుంది.



బిల్లలాపురంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరిన దాదాపు 30 కుటుంబాలు.

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. నంద్యాల మండలం బిల్లలాపురం గ్రామానికి చెందిన



దాదాపు 30 కుటుంబాలు తెలుగుదేశం పార్టీ నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. గ్రామ సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో ఈ చేరికలు చోటుచేసుకున్నాయి.
గ్రామ నాయకులు శంకర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, ఎం టి సి దేవేంద్ర గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నంద్యాల మాజీ ఎమ్మెల్యే శిల్పా రవి చంద్రకిషోర్ రెడ్డి పార్టీ కండువాలు కప్పి నూతనంగా పార్టీలో చేరిన వారిని ఆహ్వానించారు. ఈ సందర్భంగా శిల్పా రవి చంద్రకిషోర్ రెడ్డి మాట్లాడుతూ, పంచాయతీ ఎన్నికల ఫలితాలు తెలుగుదేశం పార్టీకి ప్రతికూల రాజకీయ పరిణామాలకు సంకేతమని వ్యాఖ్యానించారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని అన్నారు. హామీల అమలులో విఫలమైతే ప్రజల నుంచి రాజకీయంగా వ్యతిరేకత ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నూతనంగా పార్టీలో చేరిన కుటుంబాల సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బుడ్డాకు ఆహ్వాన పత్రిక

బండి ఆత్మకూరు పల్లె వెలుగు నవంబర్ 14: శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి కి



ఓంకారం దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు కార్తీక మాసం ఆహ్వాన పత్రికలను అందజేశారు. శనివారం ఎమ్మెల్యే స్వగ్రామమైన వేల్పనూరులో బండి ఆత్మకూరు మండల పరిధిలో ఉన్న ఓంకార దేవస్థానం చైర్మన్ చెన్నారెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఏ నాగప్రసాద్ అర్చకులు భాస్కర శర్మ తదితరులు కలిశారు. కార్తీక మాసం సందర్భంగా ఆహ్వాన పత్రికలను అందజేసి సిద్దేశ్వర స్వామి దర్శనానికి రావలసిందిగా ఎమ్మెల్యేకు ధర్మకర్త మండలి సభ్యులు విజ్ఞప్తి చేశారు.

బండి ఆత్మకూరులో బాలల దినోత్సవం



బండి ఆత్మకూరు పల్లె వెలుగు నవంబర్ 14: 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా శనివారం గ్రంథాలయ అధికారి ఎం .రవిరాజు ఆధ్వర్యంలో గ్రంథాలయ ప్రారంభ వేడుకలు ప్రారంభమయ్యాయి. బాలల దినోత్సవ సందర్భంగా జవహర్ లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకొని, ఆయన చిత్రపటాని పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సచివాలయం వెల్ఫేర్ వి. గుణ సాయి తో పాటు విద్యార్థిని విద్యార్థులు, పాఠకులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

శాఖ గ్రంధాలయం నందు ఘనంగా బాలల దినోత్సవం

దొర్నిపాడు నవంబర్ 14 పల్లె వెలుగు న్యూస్ మండల కేంద్రమైన దొర్నిపాడు శాఖ గ్రంధాలయం నందు జాతీయగ్రంథాలయవారోత్సవాలలోభాగంగబాలలదినోత్సవాన్నిఇంచార్జిగ్రంథాలయ అధికారిణి ఎస్.అఖిల బేగం ఆధ్వర్యంలో 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభోత్సవ వేడుకలు నిర్వహించడం జరిగింది. బాలల దినోత్సవం సందర్భంగానెహ్రూచిత్రపటానికిపుష్పలంకరణ చేసి ఘనంగా నిర్వహించారు,ఈకార్యక్రమమునకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినివిద్యార్థులు గ్రంథాలయపాఠకులుపాల్గొన్నారు.



ఘనముగా జవహర్ లాల్ నెహ్రూ జయంతోత్సవాలు.

పల్లె వెలుగు నంద్యాల రూరల్. జవహర్ లాల్ గణనీయమైన కృషిని స్మరించుకోవడం జరిగినది.



నెహ్రూ జయంతోత్సవాలను స్థానిక నంద్యాల రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘ భవనము నందు 14-11-2026 న ఉదయం 11 గంటలకు పెన్షనర్ల సంఘ సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగినది .ఈ సందర్భముగా జవహర్ లాల్ నెహ్రూ ఈ దేశమునకు చేసిన జవహర్ లాల్ నెహ్రూ జయంతోత్సవం సందర్భముగా, రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల లింగస్వామి మాట్లాడుతూ జవహర్ లాల్ నెహ్రూ ప్రణాళిక సంఘాన్ని ఏర్పాటు చేసి దేశ ఆర్థిక వ్యవస్థకు పటిష్టమైన పునాదిని వేసిన మహోన్నతుడని , శాస్త్ర సాంకేతిక రంగాల అభివృద్ధికి పరిశోధనలను ప్రోత్సహించి ఈ దేశ దిశా దశను మహోన్నత స్థానానికి చేర్చిన దూర దృష్టి నేత జవహర్ లాల్ నెహ్రూ అని తెలిపారు.
పారిశ్రామిక రంగానికి బహుళార్థక సాధక నదిలోయ ప్రాజెక్టులకు మరియు పెద్ద ప్రభుత్వ రంగ పరిశ్రమలను నిర్మించి వాటిని ఆధునిక భారతదేశా ఆలయాలుగా అభివర్ణించారు .
విదేశాంగ విధానములో సరికొత్త బాటను ప్రపంచానికే చవి చూపిన వ్యక్తి జవహర్ లాల్ నెహ్రూ అని తెలిపారు.
విద్యా మరియు సామాజిక సంస్కరణలకు ఇతోదిక కృషి సల్పిన మహోన్నతుడు జవహర్ లాల్ నెహ్రూ అన్నారు. ఈ జయంతోత్సవ సమావేశంలో ముఖ్య సలహాదారు కే .చిన్న సుబ్బరాయుడు, అసోసియేట్ అధ్యక్షులు డి. గఫార్, ట్రెజరర్ ఎస్ .ఖాసిం వలి, ఉపాధ్యక్షులు సిహెచ్. డేవిడ్,వైస్ ప్రెసిడెంట్ బి. వెంకటేశ్వర్లు, కార్యవర్గ సభ్యులు బాలకృష్ణ, సంజీవరావు, వెంకన్న, విజయరాజు , వెంకట రాముడు , మహేశ్వరరావు మొదలగువారు ఈ జయంతి ఉత్సవాల్లో పాల్గొనడం జరిగింది.

పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో

ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలి.

● నామినేషన్ కేంద్రాల వద్ద అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పటిష్ట పోలీసు బందోబస్తు. ● జిల్లా వ్యాప్తంగా పోలీస్ యాక్ట్ 30, సెక్షన్ 163 బి ఎన్ ఎస్ ఎస్ నిషేధాజ్ఞలు అమలు. ● నామినేషన్ కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాలతో నిరంతర నిఘా, ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు. ● జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఐపీఎస్.

పల్లె వెలుగు నంద్యాల క్రైమ్. నంద్యాల జిల్లా వ్యాప్తంగా పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ సందర్భంగా ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఐపీఎస్ ఆదేశించారు.
నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థితో పాటు కేవలం ఇద్దరు ప్రతినిధులకు మాత్రమే నామినేషన్



కేంద్రంలోకి అనుమతి ఉంటుందని తెలిపారు. నామినేషన్ కేంద్రాల వద్ద ర్యాలీలు, ఊరేగింపులు నిర్వహించడం, గుంపులుగా చేరడం, నినాదాలు చేయడం, ప్రచార కార్యక్రమాలు నిర్వహించడం నిషేధమని స్పష్టం చేశారు. నామినేషన్ కేంద్రాల పరిసరాల్లో 100 నుంచి 200 మీటర్ల పరిధిలో ఎలాంటి జనసమూహాలు గుమిగూడకుండా పోలీసు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా పోలీస్ యాక్ట్ 30 మరియు సెక్షన్ 163 బి ఎన్ ఎస్ ఎస్ నిషేధాజ్ఞలు అమల్లో ఉన్నాయని, నామినేషన్ కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాలతో నిరంతర నిఘా ఏర్పాటు చేయడంతో పాటు పటిష్టమైన పోలీసు బందోబస్తు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించినా, శాంతిభద్రతలకు భంగం కలిగించినా సంబంధిత వ్యక్తులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రశాంతమైన, పారదర్శకమైన ఎన్నికల నిర్వహణకు అభ్యర్థులు, ప్రజలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పోలీసు శాఖకు సహకరించాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

ఎఫ్ఎఫ్ఎస్ యాప్ ద్వారానే ఎరువుల పంపిణీ

బండి ఆత్మకూరు పల్లె వెలుగు నవంబర్ 14:బండి ఆత్మకూరు మండలంలో నవంబర్ 15 నుంచి ఎఫ్ఎఫ్ఎస్ యాప్ ద్వారా మాత్రమే ఎరువుల పంపిణీ జరుగుతుందని మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎరువుల పంపిణీలో పారదర్శకతతో పాటు రైతులకు వారి అవసరాలకు అనుగుణంగా ఎరువులు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ డిజిటల్ విధానాన్ని అమలు చేస్తోందని ఆయన తెలిపారు.యాప్ ద్వారా బుక్ చేయడానికి ఫార్మర్ ఐడీ, ఆధార్, పట్టాదారు పాస్‌పుస్తకానికి అనుసంధానమైన మొబైల్ నంబర్‌కు వచ్చే ఓటీపీ (ఓటిపి) ఆధారంగా నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. భూ విస్తీర్ణం, వేసిన పంట ఆధారంగా వచ్చే క్యూఆర్ (క్యూఆర్) కోడ్/టోకెన్ ద్వారా 3 రోజుల్లో డీలర్ వద్ద ఎరువులు పొందాల్సి ఉంటుంది.
రైతులు ముందుగా ఎఫ్ఎఫ్ఎస్ మొబైల్ యాప్‌లో రైతు గుర్తింపు/ఆధార్, మొబైల్ నంబర్ వివరాలతో



నమోదు చేసుకోవాలని సూచించారు.రైతుల భూముల వివరాలను రైతు రిజిస్ట్రీతో అనుసంధానం చేసి, భూమి, పంట విస్తీర్ణం ఆధారంగా ఎరువుల అవసరాన్ని జీఎఫ్ఆర్ – జనరల్ ఫెర్టిలేజర్ రెకమండేషన్ విధానంలో నిర్ణయిస్తారని పేర్కొన్నారు. యాప్‌లో సూచించిన మేరకు ఎరువుల పరిమాణం అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఎరువులు తీసుకునే సమయంలో క్యూఆర్ కోడ్, టోకెన్ నంబర్ ఆధారంగా డీలర్ల వద్ద ఎరువులు పొందవచ్చని వివరించారు.యాప్ వినియోగంలో ఇబ్బందులు ఎదుర్కొనే రైతులు సంబంధిత రైతు సేవా కేంద్రాల సిబ్బంది సహాయం పొందాలని ఏఓ పవన్ సూచించారు. ఎరువుల అక్రమ పంపిణీ, దుర్వినియోగం, కృత్రిమ కొరతను అరికట్టి నిజమైన రైతులకు సముచితంగా ఎరువులు అందించడమే ఈ విధానం లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

కేసీ కెనాల్‌కు తక్షణమే సాగునీరు విడుదల చేసి రైతులను ఆదుకోండి.

మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ పురుషోత్తం రెడ్డి .

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. వర్షాభావం వల్ల ఎండిపోతున్న పంటలు,



ఆందోళనలో అన్నదాతలు,

ప్రకృతి కరుణించక, సరిపడా వర్షాలు కురవక అల్లాడిపోతున్న అన్నదాతలను ఆదుకునేందుకు ప్రభుత్వం తక్షణమే కేసీ కెనాల్‌కు సాగునీరు విడుదల చేయాలని, మంత్రి తక్షణమే స్పందించాలని రైతులు కోరుతున్నారు. నేడు మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ పురుషోత్తం రెడ్డితో పాటు పలువురు రైతులు కేసీ కెనాల్ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ (ఈఈ) కార్యాలయానికి వెళ్లి అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు తాము పడుతున్న ఇబ్బందులను, కష్టాలను అధికారుల ఎదుట ఏకరువు పెట్టారు. సాగునీరు సకాలంలో అందక తాము సాగు చేసిన పంటలు కళ్లెదుటే ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.
మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ పురుషోత్తం రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం వెలుగోడు రిజర్వాయర్‌లో 9.5 టీఎంసీల నీటి నిల్వలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అందులో కేవలం ఒక్క టీఎంసీ నీటిని మాత్రమే కేసీ కెనాల్‌కు విడుదల చేస్తే, ఆయకట్టు కింద ఉన్న వేలాది ఎకరాల పంటలకు జీవం పోసినట్లవుతుందని కోరారు. ముఖ్యంగా జొన్న పంట సాగు చేసిన రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరో రెండు రోజుల్లోగా నీరు అందకపోతే పంట పూర్తిగా ఎండిపోయి, రైతులు కోలుకోలేని ఆర్థిక నష్టాన్ని చవిచూడాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక మంత్రి మరియు ప్రజాప్రతినిధులు స్పందించి, రైతుల కష్టాలను మానవతా దృక్పథంతో పరిశీలించాలని కోరారు. తక్షణమే సంబంధిత అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేసి, కేసీ కెనాల్ ద్వారా సాగునీరు అందించి తమను ఆదుకోవాలని రైతులు కన్నీటి పర్యంతమయ్యారు. అన్నదాతలను ఆదుకునేందుకు ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన స్పందించాలని విజ్ఞప్తి చేశారు.

అడుగంటిన తుంగభద్ర ఎల్ఎల్సీ కాలువ..

నీటి కోసం రైతుల ఎదురుచూపులు!

నవంబర్ 20 వరకు నీటి విడుదల గడువు.. అయినా మూడు రోజులుగా కాలువలో తగిన నీటి ప్రవాహం





హోళగుంద పల్లె వెలుగు నవంబర్:14 తుంగభద్ర దిగువ కాలువ (ఎల్ఎల్సీ)లో నీటి ప్రవాహం తగ్గిపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నవంబర్ 20 వరకు నీటి విడుదల గడువు ఉన్నప్పటికీ, గత మూడు రోజులుగా కాలువలో నీటి ప్రవాహం నిలిచిపోవడంతో కాలువ అడుగంటిపోయింది.

కాలువ ద్వారా సాగునీరు అందుతుందని ఆశించిన రైతులకు నీరు అందకపోవడంతో పంటల పరిస్థితిపై ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పటికే సాగు పనుల కోసం పెట్టుబడులు పెట్టిన రైతులు నీటి కోసం ఎదురుచూస్తూ దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

నీటి విడుదల గడువు ఇంకా ఉన్నప్పటికీ కాలువలో నీటి ప్రవాహం ఎందుకు నిలిచిపోయిందో అధికారులు స్పష్టత ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. వెంటనే స్పందించి ఎల్ఎల్సీ కాలువకు నీటి సరఫరా పునరుద్ధరించి పంటలను కాపాడాలని రైతులు సంబంధిత అధికారులను విజ్ఞప్తి చేస్తున్నారు.

అధికారుల వివరణ ఇదీ..

ఈ విషయంపై ఎల్ఎల్సీ జేఈ ఉషను వివరణ కోరగా, కర్ణాటక రాష్ట్రానికి సంబంధించిన నీటి కోటాను నవంబర్ 15 నుంచి నిలిపివేస్తున్నట్లు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సంబంధించిన నీటి కోటా నవంబర్ 20 వరకు కొనసాగనున్నట్లు పై అధికారులు తెలిపారని ఆమె వెల్లడించారు.

అయితే ఆంధ్రప్రదేశ్ కోటా నవంబర్ 20 వరకు ఉన్నప్పటికీ, గత మూడు రోజులుగా కాలువలో నీటి ప్రవాహం లేకపోవడంపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నీటి విడుదలపై అధికారులు స్పష్టత ఇచ్చి సాగునీరు అందించాలని రైతులు కోరుతున్నారు.

సర్పంచ్ పదవా.. సేవా...? స్వప్రయోజనమా....?

● గజ్జహల్లిలో సర్పంచ్ కుర్చీ కోసం కురుక్షేత్రం.. ● ఆశావహుల మధ్య ఆధిపత్య పోరు..! ● జనరల్ రిజర్వేషన్‌తో ఆశావహుల్లో కొత్త ఉత్సాహం.. ● పోటీకి సై అంటున్న యువత, విద్యావంతులు...!

హోళగుంద పల్లె వెలుగు నవంబర్:14 మండల పరిధిలోని గజ్జహల్లి గ్రామంలో సర్పంచ్ ఎన్నికల సందడి రోజురోజుకూ పెరుగుతోంది. ఎన్నికల ప్రకటనతో గ్రామంలో రాజకీయ వాతావరణం వేడెక్కుతోంది. జనరల్ రిజర్వేషన్ రావడంతో సర్పంచ్ పదవికి పోటీ చేయాలని పలువురు ఆశావహులు ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తోంది. రాజకీయ అనుభవం ఉన్నవారితో పాటు యువకులు, విద్యావంతులు సైతం ఎన్నికల బరిలో నిలిచేందుకు సిద్ధమవుతున్నట్లు గ్రామంలో చర్చ సాగుతోంది.

ఈసారి గ్రామంలో సర్పంచ్ పదవి కోసం పోటీ రసవత్తరంగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే గ్రామానికి నిజంగా సేవ చేయాలనే సంకల్పంతో ముందుకు వచ్చేవారు ఎవరు? గ్రామ అభివృద్ధి పేరుతో అధికారాన్ని ఆశించేవారు ఎవరు? అన్నది ఇప్పుడు గ్రామ ప్రజల్లో చర్చనీయాంశంగా మారింది.

ప్రజలకు కావాల్సింది పదవి కోసం పోటీ పడే నాయకులు కాదు.. గ్రామ అభివృద్ధి కోసం పనిచేసే నాయకులు.

గతంలో గ్రామానికి చేసిన సేవలు, ప్రజలకు అందుబాటులో ఉన్న తీరు, అభివృద్ధిపై ఉన్న ఆలోచనలు, పారదర్శకత వంటి అంశాలను ప్రజలు పరిశీలించాల్సిన అవసరం ఉంది. ఎన్నికల సమయంలో హామీల వర్షం కురిపించి, గెలిచిన తర్వాత ప్రజలను పట్టించుకోని నాయకత్వం గ్రామానికి అవసరమా? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.



సర్పంచ్ పదవి అనేది సంపాదనకు మార్గం కాదు.. ప్రజాసేవకు బాధ్యత. గ్రామ నిధులు గ్రామ అభివృద్ధికే ఖర్చు కావాలి. అవినీతికి, అక్రమాలకు తావులేకుండా పాలన సాగాలి.

మరి గజ్జహల్లి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించే నాయకుడు ఎవరు? ప్రజాసేవ ముసుగులో స్వప్రయోజనాలు చూసేవారు ఎవరు? అన్నది ప్రజల పరిశీలనలో తేలాల్సి ఉంది. ఈసారి గ్రామ ప్రజల తీర్పు ఎలా ఉండబోతోందో వేచి చూడాలి!

కామన్వెల్త్ కరాటే ఛాంపియన్‌షిప్‌లో కర్నూలు విద్యార్థుల సత్తా..

అంతర్జాతీయ స్థాయిలో పతకాలతో మెరిసిన క్రీడాకారులు

-హేమంత్ కుమార్ రెడ్డికి గోల్డ్ మెడల్..
దినేష్‌కు బ్రాంజ్ మెడల్
-విజేత క్రీడాకారులను ఘనంగా సత్కరించిన మంత్రి టీజీ భరత్

పల్లె వెలుగు కర్నూలు బ్యూరో స్కాట్లాండ్‌లో నిర్వహించిన 12వ కామన్వెల్త్ కరాటే ఛాంపియన్‌షిప్--2026లో కర్నూలుకు చెందిన విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో అద్భుత ప్రతిభ కనబరిచి పతకాలు సాధించడం ఎంతో గర్వకారణమని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. కర్నూలు క్రీడాకారులు అంతర్జాతీయ వేదికపై సత్తా చాటడం జిల్లా ప్రజలకు ఎంతో ఆనందాన్ని, గౌరవాన్ని తీసుకొచ్చిందని పేర్కొన్నారు.



కర్నూలు ఔట్‌డోర్ స్టేడియంలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో మంత్రి టీజీ భరత్ పాల్గొని పతక విజేతలను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కామన్వెల్త్ కరాటే ఛాంపియన్‌షిప్‌లో భారతదేశం మొత్తం 23 పతకాలు సాధించగా, ఆంధ్రప్రదేశ్‌కు మూడు పతకాలు లభించాయని తెలిపారు. ఇందులో కర్నూలుకు చెందిన హేమంత్ కుమార్ రెడ్డి గోల్డ్ మెడల్ సాధించడం ఎంతో గర్వంగా ఉందన్నారు. మరో క్రీడాకారుడు దినేష్ బ్రాంజ్ మెడల్ సాధించడం అభినందనీయమని పేర్కొన్నారు.

క్రీడాకారుల విజయాలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రత్యేకంగా అపాయింట్‌మెంట్ తీసుకుని ఇటీవల వారిని కలిసే అవకాశం కల్పించానని మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి క్రీడాకారులతో స్వయంగా మాట్లాడి వారి విజయాలను అభినందించారని చెప్పారు.

గోల్డ్ మెడల్ సాధించిన క్రీడాకారుడికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున అందాల్సిన ప్రైజ్ మనీ ఇప్పించేందుకు కృషి చేస్తున్నానని మంత్రి వెల్లడించారు. అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన క్రీడాకారులకు అందించే సర్టిఫికెట్లు భవిష్యత్తులో ప్రభుత్వ ఉద్యోగాల అవకాశాలకు కూడా ఉపయోగపడతాయని తెలిపారు.

విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపైనా ప్రత్యేక శ్రద్ధ చూపాలని, నిరంతర సాధన, క్రమశిక్షణ, పట్టుదలతో ముందుకు సాగాలని సూచించారు. ఈ క్రీడాకారులను స్ఫూర్తిగా తీసుకుని మరింత మంది విద్యార్థులు క్రీడల్లో రాణించాలని పిలుపునిచ్చారు. కర్నూలులో క్రీడా రంగ అభివృద్ధికి తాము ఎంతో కృషి చేస్తున్నామని, క్రీడాకారులకు మెరుగైన వసతులు కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు.

ఈ కార్యక్రమంలో కరాటే కోచ్ పి. జగదీష్ కుమార్ ని మంత్రి టి.జి. భరత్ ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థుల విజయాల వెనుక కోచ్ కృషి, అంకితభావాన్ని ప్రశంసించారు.

ఈ కార్యక్రమంలో 61వ వార్డు కార్పొరేటర్ గాజుల విజయభాస్కర్ రెడ్డి, 62వ వార్డు కార్పొరేటర్ సురేంద్ర, సీనియర్ కరాటే మాస్టర్స్ హరీష్, గౌస్ బాషా, రమణ, ఫయాజ్, మునాఫ్, రాంబాబు, సురేంద్ర చిన్న తదితరులు పాల్గొన్నారు.

రాయల్ మరియు నారాయణ పాఠశాలలో

ఘనంగా బాలల దినోత్సవం కార్యక్రమం.

పల్లె వెలుగు నంద్యాల రూరల్. నంద్యాల పట్టణంలోని స్థానిక రాయల్ మరియు నారాయణ



పాఠశాలల్లో ఘనముగా బాలల దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు . ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ డాక్టర్ వి. యాకుబ్ మరియు కరెస్పాండెంట్ వి. ఇషాక్‌వలి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ వి. యాకుబ్ మాట్లాడుతూ జవహరలాల్ నెహ్రూ జీవిత విశేషాలను పిల్లలకు వివరించడం జరిగింది. పిల్లలు అంటే నెహ్రు కి చాలా ఇష్టమని ఆయన ఒక సంపన్న కుటుంబంలో జన్మించినప్పటికీ దేశం కోసం గాంధీ తో స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొని అనేకసార్లు జైలుకు వెళ్లడం జరిగిందని తెలిపారు. మన దేశానికి స్వాతంత్రం వచ్చిన తర్వాత మన దేశానికి మొట్టమొదటి ప్రధానిగా ఎన్నుకోవడం జరిగింది అని వివరించారు. అనంతరం విద్యార్థుల సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. ఆటల పోటీల్లో విజయం పొందినటువంటి విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొనడం జరిగింది.

బాలల దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న 51వ వార్డు కౌన్సిలర్ తాటికొండ విజయ వార్డు ఇంచార్జి తాటికొండ బుగ్గరాముడు.

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. నంద్యాల టౌన్ పరిధిలోని వై.యస్.ఆర్ నగర్ నందు గల స్టార్ సొసైటీ వారి నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆవాసియా బుడగజంగాల హాస్టల్



నందు బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా 51వ వార్డు కౌన్సిలర్ తాటికొండ విజయ,వార్డు టీడీపీ ఇంచార్జి తాటికొండ బుగ్గరాముడు యువ నాయకుడు తాటికొండ మహేష్ బాబు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశ మొట్ట మొదటి ప్రధానమంత్రి జోహార్ లాల్ నెహ్రూ జన్మదినాన్ని పురస్కరించుకుని వారి చిత్ర పటానికి పూలమాలలు వేసి కేక్ కట్ చేసి ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది అని వారు అన్నారు. అనంతరం బాలల దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి కౌన్సిలర్ విజయ చేతుల మీదగా ప్రోత్సహక బహుమతులు అందజేయడం జరిగింది అని అన్నారు. కౌన్సిలర్ విజయ చేతుల మీదుగా విద్యార్థిని విద్యార్థులకు భోజనాలు వడ్డించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వ్యవస్థాపకులు సుబ్బారాయుడు, రాజేశ్వరి, కల్కి రాఘవేంద్ర, మరియు హాస్టల్ సిబ్బంది పిల్లలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

నామినేషన్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు



పల్లె వెలుగు కర్నూలు బ్యూరో పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా నిర్వహించేందుకు జిల్లా వ్యాప్తంగా పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రజలు ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని శనివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు.

నిబంధనలు ఇవే.. పరిమిత అనుమతి: నామినేషన్ కేంద్రంలోకి అభ్యర్థితో పాటు కేవలం ఇద్దరు ప్రతినిధులకు మాత్రమే అనుమతి ఉంటుంది.

నిషేధాజ్ఞలు అమలు: జిల్లాలో 30 పోలీస్ యాక్ట్, సెక్షన్ 163 బీఎన్ఎస్ఎస్ (దీచీూూ) నిషేధాజ్ఞలు అమలులో ఉన్నాయి.


ర్యాలీలకు నో: నామినేషన్ కేంద్రాల వద్ద ర్యాలీలు, ఊరేగింపులు నిర్వహించడం, గుంపులుగా రావడం పూర్తిగా నిషేధం. కేంద్రాలకు 100 నుంచి 200 మీటర్ల పరిధిలో జనసమూహాలు గుమిగూడటం, నినాదాలు చేయడం, ప్రచారం నిర్వహించడంపై ఆంక్షలు విధించారు.

డ్రోన్లు, సీసీ కెమెరాలతో నిఘా: ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నామినేషన్ కేంద్రాల పరిసరాల్లో సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాలతో నిరంతర నిఘా ఏర్పాటు చేసినట్లు ఎస్పీ పేర్కొన్నారు.

ఎన్నికలు పారదర్శకంగా, శాంతియుత వాతావరణంలో జరిగేలా ప్రతి ఒక్కరూ పోలీసు శాఖకు పూర్తి సహకారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఎరువుల విక్రయాలకు కొత్త విధానం.

నేటి నుంచి ఎఫ్ఎఫ్ఎస్ యాప్ ద్వారా విక్రయాలు.



పల్లె వెలుగు నంద్యాల రూరల్ ఈ నెల 15వ తేదీ నుంచి ఫ్రేమ్‌వర్క్ ఫర్ ఫెర్టిలైజర్ సేల్ (ఎఫ్ఎఫ్ఎస్) యాప్ ద్వారా ఎరువుల విక్రయాలు చేపట్టనున్నట్లు నంద్యాల మండల వ్యవసాయ అధికారి ప్రసాదరావు తెలిపారు. రైతులు తాము సాగు చేసిన పంటలకు అనుగుణంగా అవసరమైన ఎరువులను యాప్‌లో బుక్ చేసుకుని, సమీపంలోని డీలర్‌ను ఎంపిక చేసుకోవచ్చని తెలిపారు. క్యూఆర్ కోడ్ ద్వారా ఎరువులు కొనుగోలు చేయవచ్చన్నారు. ప్రైవేట్ డీలర్లతో పాటు రైతు సేవా కేంద్రాల్లోనూ ఈ విధానం అమలవుతుందని పేర్కొన్నారు. రైతులకు అవగాహన కల్పించేందుకు డీలర్ దుకాణాల్లో సహాయ కేంద్రాలు ఏర్పాటు చేయడంతో పాటు రైతు సేవా కేంద్రాల సిబ్బంది సహకారం అందిస్తారని వివరించారు.

నేటినుంచివిధానం లో ఎరువుల అమ్మకాలు



దొర్నిపాడు నవంబర్ 14 పల్లె వెలుగు న్యూస్ నేటి నుంచి రైతులు ఉపయోగించే ఎరువుల విక్రయాలు అన్ని ఖీఖీూ విధానం లో జరుగుతాయని మండల వ్యవసాయఅధికారి ప్రమీల అన్నారు, ఈ విధానం వల్ల రైతులకు అవసరమైన ఎరువులు సకాలం లో అందుబాటులో ఉంటాయి, పారదర్శక విధానం లో ఎరువుల పంపిణీ అలాగే క్యూ లైన్లలో వేచి ఉండకుండా నేరుగా ఎరువులను డీలర్ల నుంచి పొందవచ్చు. ఈ యాప్ వాడకం లో ఏవైనా సందేహాలు ఉన్నట్లయితే డీలర్లు లేదా వ్యవసాయ శాఖ సిబ్బంది ద్వారా నివృతి చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి శ్రీమతి ప్రమీలతెలిపారు.

వివాహ ముహూర్త కార్యక్రమం నకు

హాజరయిన మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె నవంబర్ 14,పల్లెవెలుగు సంజామల మండలం కానాల గ్రామానికి చెందిన



కీర్తిశేషులు మద్దూరు వీర శేఖర్ రెడ్డి కుమార్తె వివాహ ముహూర్త కార్యక్రమానికి హాజరు అయి నూతన వధువును ఆశీర్వదించిన బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, ఈ కార్యక్రమం లో వైఎస్సార్సీపీ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి సిద్ధం రెడ్డి రామ్మోహన్ రెడ్డి, కానాల గ్రామ వైఎస్సార్సీపీ నాయకురాలు పాలూరు పద్మావతి,గోవర్ధన్ రెడ్డి, పోచా వెంకటరామిరెడ్డి, పవన్ రెడ్డి, బాలమద్దు, పెద్దయ్య తదితరులు పాల్గొన్నారు

ఘనంగా ఐఎఫ్ఎల్ ఎస్ లోన్స్ సూపర్ మార్కెట్ ప్రైవేట్ లిమిటెడ్ నూతన బ్రాంచి ప్రారంభం

-కోవెలకుంట్ల లో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కాల్వ నాగేశ్వరరావు చేతుల మీదుగా ప్రారంభోత్సవం

బనగానపల్లె,నవంబర్ 14, పల్లెవెలుగు నంద్యాల జిల్లా కోవెలకుంట్ల పట్టణం లో





నూతనంగా ఐఎఫ్ఎల్ ఎస్ లోన్స్ సూపర్ మార్కెట్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ తన 162 వ బ్రాంచ్ ని ప్రారంభించారు. కోవెలకుంట్ల పట్టణంలో స్కందా కాలనీలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కాల్వ నాగేశ్వరరావు ప్రారంభించారు అనంతరం కంపెనీ జోనల్ మేనేజర్ వడ్డే పెద్ద భీమన్నమాట్లాడుతూ వాహన రుణాలు, వ్యక్తిగత రుణాలు, వ్యాపార రుణాలు గృహ రుణాలు, మార్టగేజ్ రుణాలు తదితర ఎటువంటి లోన్స్ అయినా కంపెనీ నుండి చేయవచ్చని అన్ని బ్యాంకులతో భాగస్వామ్యం కలిగి ఉందని తెలియచేశారు. ప్రారంభోత్సవంలో ఏరియా సేల్స్ మేనేజర్ మనోహర్,రిలేషన్షిప్ మేనేజర్ శ్రీను, జాతీయ బీసీ సంక్షేమ సంఘం బనగానపల్లె నియోజకవర్గ అధ్యక్షుడు ఈ వెంకటరమణ గౌడ్ మరియు కంపెనీ ప్రతినిధులు పట్టణంలోని ప్రజలు ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు అని బ్రాంచి మేనేజర్ రాంబాబు తెలియచేశారు.

క్రీడలతోనే విద్యార్థుల్లో సమగ్ర వికాసం.

-నారాయణ ప్రీమియర్ లీగ్‌లో ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు.

ఆదోని (పల్లె వెలుగు):ఆదోని నారాయణ పాఠశాలలో శనివారం నిర్వహించిన నారాయణ ప్రీమియర్ లీగ్ (ఎం పి ఎల్) క్రీడా పోటీలు ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎస్. అమర్ ప్రకాష్, కే.ఎం. ముజీబ్, ఏజీఎం అన్వర్ భాషా, కిడ్స్ జోనల్ కోఆర్డినేటర్ జయిబా, ఛాంప్స్ జోనల్ కోఆర్డినేటర్ ప్రియాంక హాజరయ్యారు.

ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు శ్రీమతి లక్ష్మీ రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి విద్యార్థిలోనూ ఏదో ఒక ప్రత్యేక ప్రతిభ దాగి ఉంటుందని, ఆ ప్రతిభను గుర్తించి ప్రోత్సహించేందుకు నారాయణ ప్రీమియర్ లీగ్ వంటి క్రీడా వేదికలు ఎంతగానో





దోహదపడతాయని అన్నారు.

ముఖ్య అతిథి ఎస్. అమర్ ప్రకాష్ మాట్లాడుతూ విద్యార్థుల జీవితంలో చదువుతో పాటు క్రీడలు కూడా ఎంతో ముఖ్యమైనవని తెలిపారు. క్రీడలు కేవలం వినోదం మాత్రమే కాదని, పట్టుదల, క్రమశిక్షణ, సమయపాలనతో పాటు జట్టుగా పనిచేసే మనస్తత్వాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు.

ఏజీఎం అన్వర్ భాషా మాట్లాడుతూ విద్యార్థులు నారాయణ ప్రీమియర్ లీగ్ పోటీల్లో ఎంతో ఉత్సాహంగా పాల్గొని తమ ఆటతీరుతో అందరినీ ఆకట్టుకున్నారని తెలిపారు. మైదానంలో విద్యార్థుల ఉత్సాహం, జట్ల మధ్య పోటీ, ప్రేక్షకుల కేరింతలతో క్రీడా వాతావరణం సందడిగా మారిందన్నారు.

కే.ఎం. ముజీబ్ మాట్లాడుతూ చిన్నతనం నుంచే పిల్లల్లో చదువుతో పాటు క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించాలని అన్నారు. ఆటలు విద్యార్థుల్లో శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసం, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని తెలిపారు. గెలుపు ఒక్కటే లక్ష్యం కాదని.. క్రీడాస్ఫూర్తితో ఆడటం, ఓటమి నుంచి పాఠాలు నేర్చుకోవడం, పట్టుదలతో ముందుకు సాగడమే నిజమైన విజయం అని విద్యార్థులకు సూచించారు.

జోనల్ కోఆర్డినేటర్లు జయిబా, ప్రియాంక మాట్లాడుతూ నారాయణ ప్రీమియర్ లీగ్ ద్వారా విద్యార్థులకు తమ ప్రతిభను ప్రదర్శించే మంచి అవకాశం లభిస్తోందన్నారు. తల్లిదండ్రులు మాట్లాడుతూ విద్యార్థుల విద్యాభివృద్ధితో పాటు క్రీడా రంగంలోనూ వారిని ప్రోత్సహిస్తూ నారాయణ ప్రీమియర్ లీగ్ నిర్వహించడం అభినందనీయమని ప్రశంసించారు.

ఈ కార్యక్రమంలో నారాయణ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో పంచాయతీ ఎన్నికలు ... ఎస్పీ మహమ్మద్ రఫీ.

రుద్రవరం : పల్లె వెలుగు: రుద్రవరం మండల



పరిధిలోని గ్రామాలలో జరగనున్న పంచాయతీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని ఎస్ఐ మహమ్మద్ రఫీ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ మండలంలో నేటి నుండి జరగనున్న పంచాయతీ ఎన్నికల నామినేషన్ ప్రక్రియలో ఎన్నికల నియమ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని అన్నారు. నామినేషన్ ప్రక్రియలో భాగంగా నామినేషన్ కేంద్రానికి 100 మీటర్ల పరిధిలో ఉండాలని, నామినేషన్ దాఖల్ చేసేందుకు వచ్చే అభ్యర్థితో పాటు మరో ఇద్దరిని మాత్రమే లోపలికి అనుమతించడం జరుగుతుందని తెలిపారు. నామినేషన్ కేంద్రం పరిధిలో 104 సెక్షన్ తో పాటు పోలీస్ చట్టం సెక్షన్ 30 అమలులో ఉంటుందన్నారు. అనుమతి లేకుండా గుంపులుగా చేరడం నిషేధించామన్నారు. ర్యాలీలు ఊరేగింపులు సౌండ్ సిస్టం మైకులు ఉపయోగించడానికి ఎలాంటి అనుమతి లేదన్నారు. నామినేషన్ ప్రక్రియలో లైసెన్సుడు ఆయుధాలు కత్తులు కర్రలు లేక ఇతర ప్రమాదకరమైన వస్తువులను తీసుకురావడం నిషేధమని ఎన్నికల ప్రవర్తన నియమావళిని తప్పనిసరిగా పాటించాలన్నారు. ఎన్నికల నిబంధనలను పాటిస్తూ ప్రశాంత వాతావరణంలో నామినేషన్లు పూర్తి చేసేందుకు అభ్యర్థులు, రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలు పోలీసులకు సహకరించాలని ఎస్పీ కోరారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించినా, ఎన్నికల నిబంధనలను ఉల్లంగించిన అలాంటి వారిపై మోడల్ ఆఫ్ కండక్ట్ బి.ఎన్.ఎస్ మరియు ఇతర చట్టపరమైన నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.

జాతీయ స్థాయిలో 7వ నేషనల్ వాటర్

అవార్డు సాధనే లక్ష్యంగా సమన్వయంతో పనిచేయాలి.

- **నీటి సంరక్షణ, జల వనరుల అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా ప్రదర్శించాలి.**
- **క్షేత్రస్థాయి పరిశీలనకు వచ్చే కేంద్ర బృందానికి జిల్లాలో చేపట్టిన ఉత్తమ పనులను వివరించాలి.**
- **జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.**

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. జిల్లాలో నీటి సంరక్షణ, జల వనరుల అభివృద్ధి, భూగర్భ జలాల పరిరక్షణకు వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమాలను సమర్థవంతంగా వివరించి, 7వ జాతీయ జల అవార్డులు సాధించే దిశగా సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో 7వ జాతీయ జల అవార్డుల సాధనకు సంబంధించి కేంద్ర ప్రభుత్వానికి సమర్పించాల్సిన ప్రతిపాదనలు, జిల్లాలో నీటి సంరక్షణ కోసం చేపట్టిన కార్యక్రమాలు, సాధించిన ప్రగతిపై వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సెంట్రల్ వాటర్ కమిషన్ నుంచి వచ్చే బృందం జిల్లాలో చేపట్టిన నీటి సంరక్షణ, జల వనరుల అభివృద్ధి కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, ధ్రువీకరించనున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో సంబంధిత శాఖల అధికారులు పూర్తి సమాచారంతో, సమగ్ర నివేదికలు, ఆధారాలతో సిద్ధంగా ఉండాలని సూచించారు. ఈ నెల 17, 18 తేదీల్లో కేంద్ర బృందం జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో బనగానపల్లి, ఔకు, కొలిమిగుండ్ల తదితర ప్రాంతాల్లో పర్యటనకు అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. జల వనరుల శాఖ, వ్యవహరించాలని, జిల్లాలో సాధించిన ప్రగతిని



డ్వామా ఆధ్వర్యంలో చేపట్టిన నీటి సంరక్షణ పనులు, పండ్ల తోటలు, మొక్కల పెంపకం, పాఠశాలలు, గ్రామ పంచాయతీలు, ఆసుపత్రుల్లో పచ్చదనం పెంపునకు చేపట్టిన కార్యక్రమాలను బృందానికి వివరించాలని కలెక్టర్ ఆదేశించారు.

అదేవిధంగా రెండవ రోజు నంద్యాల పట్టణంలోని మురుగునీటి శుద్ధి కేంద్రం (ట్రీట్‌మెంట్ ప్లాంట్), పాణ్యం, బేతంచెర్ల, డోన్ మండలాల్లో చేపట్టిన వివిధ అభివృద్ధి, నీటి సంరక్షణ కార్యక్రమాలను కేంద్ర బృందం పరిశీలించనున్నట్లు తెలిపారు. మైక్రో ఇరిగేషన్, జల వనరులు, డ్వామా, పబ్లిక్ హెల్త్, గ్రౌండ్ వాటర్ తదితర శాఖలు తమ పరిధిలో అమలు చేసిన ఉత్తమ కార్యక్రమాలను గుర్తించి, వాటి ఫలితాలు, ప్రభావాన్ని స్పష్టమైన గణాంకాలు, ఫొటోలు, సంబంధిత రికార్డులతో సహా ప్రదర్శించాలని కలెక్టర్ ఆదేశించారు. కేంద్ర బృందం క్షేత్రస్థాయి పరిశీలనకు వచ్చినప్పుడు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో సమర్థవంతంగా వివరించేలా నాణ్యమైన ప్రజెంటేషన్ సిద్ధం చేయాలని సూచించారు. జాతీయ స్థాయిలో నంద్యాల జిల్లాకు గుర్తింపు తీసుకువచ్చేలా ప్రతి శాఖ బాధ్యతాయుతంగా పనిచేసి, 7వ జాతీయ జల అవార్డు సాధనకు కృషి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.



రేపటి నుండి రాష్ట్రవ్యాప్తంగా 'ఎఫ్.ఎఫ్.ఎస్ యాప్ ద్వారా ఎరువుల విక్రయాలు.

☛ఎరువుల పంపిణీలో పారదర్శకత కోసం నూతన డిజిటల్ విధానం: నంద్యాల జిల్లా వ్యవసాయాధికారి నున్న వెంకటేశ్వర్లు.

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. భారత ప్రభుత్వం రూపొందించిన నూతన డిజిటల్ యాప్ 'ఫ్రేమ్ వర్క్ ఫర్ ఫెర్టిలైజర్ సేల్ (ఎఫ్ ఎఫ్ ఎస్ - ఎరువుల విక్రయ విధానం)' రాష్ట్రవ్యాప్తంగా రేపటి నుండి (నవంబర్ 15, 2026) అమలులోకి రానున్నట్లు నంద్యాల జిల్లా వ్యవసాయాధికారి నున్న వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు.

ఎరువుల పంపిణీలో పారదర్శకతను పెంచడం, అక్రమ నిల్వలను (హోర్డింగ్) అరికట్టడం మరియు ఎరువుల దుకాణాల వద్ద రైతుల నిరీక్షణ సమయాన్ని తగ్గించడమే ఈ నూతన యాప్ యొక్క ముఖ్య ఉద్దేశ్యమని ఆయన పేర్కొన్నారు. ఈ యాప్



ద్వారా రైతులు తమకు నచ్చిన సమీప దుకాణంలో ఎరువులను ముందస్తుగా బుక్ (రిజర్వ్) చేసుకోవచ్చని తెలిపారు. బుకింగ్ చేసుకున్న తర్వాత లభించే క్యూఆర్ కోడ్ ద్వారా రెండు రోజుల లోపు ఎరువులను సులభంగా పొందవచ్చని వివరించారు.

ఈ నూతన యాప్ పనిచేసే విధానంపై శనివారం నంద్యాల జిల్లాలోని క్షేత్ర స్థాయి వ్యవసాయ సిబ్బందికి మాస్టర్ ట్రైనర్ కళ్యాణ్ కుమార్ ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ గంగాధర్ మాట్లాడుతూ, ఎఫ్.ఎఫ్.ఎస్ యాప్ వినియోగంపై గ్రామాల్లో విస్తృత ప్రచారం కల్పించి, రైతులందరికీ పూర్తి అవగాహన కలిగించాలని క్షేత్ర స్థాయి సిబ్బందిని ఆదేశించారు.

బ్లైండ్ ఫౌండేషన్‌కు అవసరమైన పరికరాలు అందజేసిన మంత్రి టీజీ భరత్

-సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తాం -- మంత్రి టీజీ భరత్

పల్లె వెలుగు కర్నూలు బ్యూరో కర్నూలు



నగరంలోని మంత్రి టీజీ భరత్ కార్యాలయంలో.. బ్లైండ్ ఫౌండేషన్ సంస్థకు కర్నూలు ఎగ్జిబిషన్ సొసైటీ సౌజన్యంతో ఏర్పాటు చేసిన వాషింగ్ మిషన్, రిఫ్రిజిరేటర్, కంప్యూటర్, ఆఫీస్ టేబుల్స్, డెస్క్‌టాప్, కీబోర్డులను రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఆహార శుద్ధి శాఖ మంత్రి టీజీ భరత్ అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ.. బ్లైండ్ ఫౌండేషన్ వంటి సేవా సంస్థలకు టీజీవీ గ్రూప్ సంస్థలతో పాటు కర్నూలు ఎగ్జిబిషన్ సొసైటీ తరఫున అవసరమైన సహాయ సహకారాలు అందిస్తున్నామని తెలిపారు. గతంలో బ్లైండ్ ఫౌండేషన్‌ను సందర్శించిన సమయంలో సంస్థ ప్రతినిధుల కోరిక మేరకు కంప్యూటర్లను అందజేశామని గుర్తు చేశారు. తాజాగా సంస్థ ప్రతినిధులు తమకు అవసరమైన వస్తువులను సమకూర్చాలని విజ్ఞప్తి చేయడంతో కర్నూలు ఎగ్జిబిషన్ సొసైటీ సౌజన్యంతో వాషింగ్ మిషన్, రిఫ్రిజిరేటర్, కంప్యూటర్, ఆఫీస్ టేబుల్స్, డెస్క్‌టాప్, కీబోర్డులను అందజేసినట్లు వెల్లడించారు.

టీజీవీ గ్రూప్ సంస్థల ఆధ్వర్యంలో ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, భవిష్యత్తులోనూ ఈ సేవా కార్యక్రమాలను నిరంతరాయంగా కొనసాగిస్తామని మంత్రి స్పష్టం చేశారు. సేవా సంస్థలకు అండగా నిలవడం తమ బాధ్యతగా భావిస్తున్నామని పేర్కొన్నారు.

అనంతరం బ్లైండ్ ఫౌండేషన్ ప్రతినిధి సుధాకర్ మాట్లాడుతూ.. రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్, ఆయన కుమారుడు, రాష్ట్ర మంత్రి టీజీ భరత్ తమ సంస్థకు నిరంతరం సహాయ సహకారాలు అందిస్తున్నారని తెలిపారు. కర్నూలు నగరంలో టీజీ కుటుంబం అందిస్తున్న సేవా కార్యక్రమాలను చిన్నప్పటి నుంచి చూస్తున్నానని, దశాబ్దాలుగా వారు చేస్తున్న సేవా కార్యక్రమాలు అందరికీ ఆదర్శప్రాయమని కొనియాడారు. ముఖ్యంగా బ్లైండ్ ఫౌండేషన్‌కు వారు అందిస్తున్న సహకారం సంస్థ కార్యకలాపాలకు ఎంతో ఉపయోగకరంగా ఉందని, భవిష్యత్తులోనూ ఇదే విధమైన సహకారం కొనసాగించాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత వెంకటరెడ్డి, టీడీపీ నేత గౌరు వెంకటరెడ్డి, కర్నూలు నగర మేయర్ విజయ ప్రత్యూష, బ్లైండ్ ఫౌండేషన్ ప్రతినిధి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలను కూటమి అభ్యర్థులు కైవసం చేసుకోవాలి: మంత్రి ఎన్ఎండి ఫరూక్ పిలుపు.

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. రాష్ట్రంలో గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ రేపటి (నవంబర్ 15) నుండి ప్రారంభం కానున్న నేపథ్యంలో, శనివారం నంద్యాలలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ముఖ్య నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. నంద్యాల, గోస్పాడు మండలాలకు చెందిన టిడిపి ముఖ్య నాయకులతో మంత్రి ఫరూక్ సుదీర్ఘంగా చర్చించి ఎన్నికల వ్యూహాలపై దిశానిర్దేశం చేశారు.

ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ గ్రామ స్థాయిలో టిడిపి పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని కోరారు. నామినేషన్ల దాఖలు నుండి పోలింగ్ వరకు పూర్తి సమన్వయంతో పనిచేసి, నంద్యాల మరియు గోస్పాడు మండలాల్లోని సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలన్నింటినీ కూటమి అభ్యర్థులు కైవసం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

ఈ సమావేశంలో నంద్యాల మార్కెట్ యార్డ్ చైర్మన్ గుంటుపల్లి హరిబాబు , పాణ్యం వెంకటేశ్వర్లు మరియు నంద్యాల , గోస్పాడు మండలాల ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చిల్డ్రన్స్ డే సందర్భంగా ఘనంగా ఫ్రెండ్షిప్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్

ఆళ్లగడ్డ, ప్రతినిధి నవంబర్ 14 పల్లె వెలుగు పట్టణంలోని కె.వి.కె ఇండోర్ స్టేడియంలో బాలల



దినోత్సవం సందర్భంగా ఫ్రెండ్షిప్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌ను ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. ఈ టోర్నమెంట్‌లో మొదటి, రెండవ కోర్టులకు సంబంధించి ఆరు జట్లు, మూడవ, నాలుగవ కోర్టులకు సంబంధించి ఆరు జట్లు కలిపి మొత్తం 12 జట్లు పాల్గొని తమ క్రీడా ప్రతిభను ప్రదర్శించాయి. టోర్నమెంట్ విజేతలు: మొదటి బహుమతి విజేతలు: అమర్ -- మహేష్ ఓబులేష్ -- ప్రకాష్ రెండవ బహుమతి విజేతలు:తిరుపతి -- శ్రీ నుమౌలాలి -- మల్లికార్జున అనంతరం నిర్వహించిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా లక్ష్య స్పోర్ట్స్ అకాడమీ ప్రెసిడెంట్ ప్రజ్ఞ విద్యాసంస్థల అధినేత నరసింహారెడ్డి హుస్సేన్ భాష, ప్రభుత్వ డిగ్రీ కళాశాల సీనియర్ అధ్యాపకులు డాక్టర్ సి. గంగన్న, కె.వి.కె ఇండోర్ స్టేడియం సీనియర్ ప్లేయర్ సంజీవ, హనుమాన్ హార్డ్‌వేర్ అధినేత భరత్ కుమార్‌లు పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు.

ఈ సందర్భంగా కె.వి.కె ఇండోర్ స్టేడియం కోచ్ వెంకటరమణ మాట్లాడుతూ..ఇలాంటి ఫ్రెండ్షిప్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ల నిర్వహణ వల్ల క్రీడాకారుల మధ్య స్నేహపూర్వక వాతావరణం పెంపొందడంతో పాటు పరస్పర సహకారం, క్రీడా స్ఫూర్తి అలవడుతాయని తెలిపారు. అంతేకాకుండా క్రీడల ద్వారా శారీరక దృఢత్వాన్ని పెంపొందించుకోవచ్చని పేర్కొన్నారు. క్రీడాకారుల్లో మరింత ఉత్సాహం, ఆసక్తి పెంపొందించేందుకు ఇకపై ప్రతి నెలా కె.వి.కె ఇండోర్ స్టేడియంలో ఇలాంటి మోటివేషన్ టోర్నమెంట్లను నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ క్రీడాకారుల్లో స్నేహభావాన్ని, క్రీడా స్ఫూర్తిని పెంపొందించేలా చక్కటి టోర్నమెంట్ నిర్వహించిన కోచ్ వెంకటరమణను అభినందించారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి క్రీడా కార్యక్రమాలు మరిన్ని నిర్వహించాలని ఆకాంక్షించారు.

యాగంటి దేవస్థానానికి భక్తుల విరాళం



బనగానపల్లె , నవంబర్ 14, పల్లెవెలుగు మండలంలోని ప్రముఖ శైవ క్షేత్రంయాగంటి శ్రీఉమామహేశ్వర స్వామి దేవస్థానమునకు ఆళ్లగడ్డ పట్టణానికి చెందిన ఆనంతలక్ష్మి దేవస్థానమునకు రూ.10,116 లు,హైదరాబాదు నగరానికి చెందిన వెంకటసుబ్బమ్మ దేవస్థానమునకు రూ.15,116 లు విరాళముగా ఆలయ ఈఓ డి.పాండురంగా రెడ్డి, చైర్మన్ బండి మౌలీశ్వర రెడ్డి లకు అందజేశారు. దాతకు ప్రత్యేక పూజలు జరిపించి వారికి తీర్థప్రసాదాలు, శేషవస్త్రం, అందజేశారు.

28 వ సారి రక్తదానం చేసిన ఫ్రెండ్స్ బ్లడ్ గ్రూప్ ప్రతినిధి షాషావలి

బనగానపల్లె, నవంబర్ 14, పల్లెవెలుగు బనగానపల్లె పట్టణంలోని ఫ్రెండ్స్ గ్రూప్ ప్రతినిధి షాషావలి 28 వ సారి రక్తదానం చేశారు.శనివారం నంద్యాల పట్టణానికి చెందిన



తలసేమియా చిన్నారి రిషిత కు రక్తం అత్యవసరం కావడంతో బనగానపల్లె నుండి నంద్యాలకు వెళ్లి నంద్యాల బ్లడ్ సెంటర్ నందు రక్తదానం చేశారు. దీంతో షాషావలి 28వ సారి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా తలసేమియా చిన్నారి తల్లిదండ్రులు మాట్లాడుతూ అడిగిన వెంటనే నంద్యాలకు వచ్చి షాషావలి రక్తదానం చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. షాషావలికి, ఫ్రెండ్స్ బ్లడ్ గ్రూప్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. షాషావలి మాట్లాడుతూ ఫ్రెండ్ బ్లడ్ గ్రూప్ ఆధ్వర్యంలో ఆపదలో ఉన్నవారికి రక్తదానం చేసి ఆదుకుంటున్నట్లు తెలిపారు. అందరి సహాయ సహకారాల వల్ల తాను 28వ సారి రక్తదానం చేసినట్లు తెలిపారు .యువత రక్తం అవసరమున్న వారికి రక్తదానం చేసి వారిని ప్రాణాపాయ స్థితి నుండి కాపాడాలని కోరారు.తలసేమియా నిర్మూలనకు రక్తదానం చేద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో నంద్యాల బ్లడ్ సెంటర్ మేనేజర్ అచ్చు,ఇంచార్జ్ ప్రవీణ్ కుమార్, సిబ్బంది మనోహర్,సుధాకర్, రాహిల్ పాల్గొన్నారు.

శ్రీ చౌడేశ్వరి దేవస్థానానికి విరాళం



బనగానపల్లె , నవంబర్ 14, పల్లెవెలుగు మండలంలోని నందవరం శ్రీ చౌడేశ్వరి అమ్మవారి దేవస్థానానికి తెలంగాణ రాష్ట్రం, హైదరాబాద్ (హేమదుర్గ టవర్స్) చెందిన గుద్దిటి చంద్రశేఖర్, ఆయన సతీమణి జాహ్నవి దేవి, వారి కుటుంబ సభ్యులు ఆలయ అభివృద్ధి కొరకు 25,116/- రూ" చందాను ఆలయ డెవలప్ మెంట్ కమిటీ చైర్మన్ పి.వి.కుమార్ రెడ్డి ,ఆలయ కమిటీ చైర్మన్ పి.వి. నాగార్జున రెడ్డి ల సమక్షంలో ఆలయ అర్చకులకు శనివారం అందచేశారు.

అనాధలకు, సాధువులకు దుప్పట్లు పంపిణీ

బనగానపల్లె , నవంబర్ 14, పల్లెవెలుగు మండలంలోని ప్రముఖ శైవ క్షేత్రం యాగంటి శ్రీ



ఉమామహేశ్వర స్వామి దేవస్థానంలో అనాధలకు, సాధువులకు దుప్పట్లను చెలిమే దేవస్థానం ట్రస్టు చైర్మన్ బత్తుల రామ్మోహన్ రెడ్డి, సభ్యులు రామకృష్ణారెడ్డి, రాజ్యలక్ష్మి పంపిణీ చేశారు. శనివారం యాగంటి శ్రీ ఉమామహేశ్వర స్వామి దేవస్థానంలో మీరాపురం గ్రామానికి చెందిన బత్తుల ఎస్పై మల్లికార్జున రెడ్డి, బత్తుల సుమ కుమారుడైన బత్తుల రిత్విక్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా సాధువులకు ,వృద్ధులకు, అనాధలకు దుప్పట్లను బత్తుల రామ్మోహన్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, రాజ్యలక్ష్మి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బత్తుల రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ చలికాలం వృద్ధులు, సాధువులు, అనాధలు ఇబ్బందులు పడుతుండడంతో దుప్పట్లను పంపిణీ చేసినట్లు తెలిపారు.

డోన్ డిఎస్పి కి యాగంటి కార్తీక మహోత్సవ ఆహ్వానం



బనగానపల్లె, నవంబర్ 14, పల్లెవెలుగు మండలంలోని ప్రముఖ శైవ క్షేత్రం యాగంటి శ్రీ ఉమామహేశ్వర స్వామి కార్తీక మహోత్సవానికి హాజరుకావాలని డోన్ డిఎస్పి పి. శ్రీనివాసులు కు ఆహ్వాన పత్రికను అందజేశారు. శనివారం డోన్ డిఎస్పీ కార్యాలయంలో ఆలయ ఈఓ డి.పాండురంగా రెడ్డి, చైర్మన్ బండి మౌలీశ్వర రెడ్డి లు డీఎస్పీ శ్రీనివాసులును కలిసి ఈనెల 10వ తేదీ నుండి డిసెంబర్ 8వ తేదీ వరకు జరిగే కార్తీకమాస ఉత్సవాలకు హాజరుకావాలని ఆహ్వాన పత్రికను అందజేశారు .

ఏస్' బ్యాడ్మింటన్ అకాడమీ ప్రారంభం

రిబ్బన్ కట్ చేసి ప్రారంభించిన మంత్రి టీజీ భరత్, ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి

పల్లె వెలుగు కర్నూలు బ్యూరో కల్లూరు అర్బన్ 26వ వార్డులోని డాక్టర్స్ కాలనీలో



నూతనంగా ఏర్పాటు చేసిన 'ఏస్' (ఏజజు) బ్యాడ్మింటన్ అకాడమీ శనివారం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన రాష్ట్ర మంత్రి టీజీ భరత్, పాణ్యం ఎమ్మెల్యే మరియు టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షురాలు గౌరు చరిత రెడ్డి సంయుక్తంగా రిబ్బన్ కట్ చేసి అకాడమీని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. యువత, విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు. క్రీడల వల్ల శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని, ఇలాంటి ఆధునిక క్రీడా ప్రాంగణాలు స్థానిక క్రీడాకారులకు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు, క్రీడాకారులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితికి నూర్ అహ్మద్ రాజీనామా.

ఆదోని (పల్లె వెలుగు): వ్యక్తిగత, కొన్ని అనివార్య కారణాల వల్ల మైనారిటీ హక్కుల



పరిరక్షణ సమితి (వీఎూఆ) రాష్ట్ర కార్యదర్శి పదవికి, అలాగే సమితి ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ఎ. నూర్ అహ్మద్ ప్రకటించారు. ఈ మేరకు సమితి అధ్యక్షులు ఫారూఖ్ షుబ్లీకి తన రాజీనామా విషయాన్ని తెలియజేశారు. ఈ సందర్భంగా నూర్ అహ్మద్ మాట్లాడుతూ.. ఇకపై తన జీవితాన్ని ఆదోని జిల్లా సాధన కోసం అంకితం చేస్తున్నట్లు తెలిపారు. ఆదోని ఏరియా ప్రజల చిరకాల ఆకాంక్ష అయిన జిల్లా ఏర్పాటు కోసం ఊరు ఊరు, వాడ వాడ తిరిగి ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఆదోని జిల్లా ఏర్పాటుకు అవసరమైన అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, అన్ని వర్గాల ప్రజలను ఏకం చేసి జిల్లా సాధన ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్తామని తెలిపారు. ఆదోని ప్రాంత ప్రజల సహకారం, మద్దతుతో ఆదోని జిల్లాను సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఆదోని ప్రాంత అభివృద్ధి, ప్రజల భవిష్యత్తు కోసం జిల్లా ఏర్పాటు ఎంతో అవసరమని, ఈ లక్ష్య సాధన కోసం నిరంతరం ప్రజలతో కలిసి పనిచేస్తానని నూర్ అహ్మద్ స్పష్టం చేశారు. ఎ. నూర్ అహ్మద్ ఆదోని జిల్లా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు వీఎూఆ మాజీ రాష్ట్ర కార్యదర్శి ఆదోని

అగ్నిప్రమాదంలో 180 వరి గడ్డి కట్టలు దగ్ధం.



రుద్రవరం. పల్లె వెలుగు : మండలంలోని ఆర్ నాగలవరం గ్రామంలో సంభవించిన అగ్నిప్రమాదంలో 180 వరిగడ్డి కట్టలు దద్దమైనట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామస్తుల వివరాల మేరకు గ్రామానికి చెందిన చౌడూరు లక్ష్మీ నరసింహులు అనే రైతుకు చెందిన వరిగడ్డి కట్టలు నిల్వ ఉంచారన్నారు. కొందరు గుర్తుతెలియని వ్యక్తులు ధూమపానం సేవించి అక్కడే పడి వేయడంతో మంటలు వ్యాపించి వరిగడ్డి కట్టలు దగ్ధము అయ్యాయన్నారు. ఈ ప్రమాదంలో రైతుకు సుమారు రూ1లక్ష రూపాయల దాకా నష్టం జరిగి ఉంటుందని గ్రామస్తులు తెలిపారు. అగ్రి ప్రమాదం తెలుసుకున్న ఆళ్లగడ్డ అగ్నిమాపక దళ సిబ్బంది అక్కడికి చేరుకొని మంటలు పూర్తిగా ఆర్పీవై వేశారన్నారు. అగ్ని ప్రమాదంలో దగ్ధమైన వరికట్టలను రెవెన్యూ అధికారులు పరిశీలించి రైతుకు తగిన నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మహానందీశ్వరుని సేవలో న్యాయమూర్తి పూజలు



మహానంది, పల్లె వెలుగు మహానంది పుణ్యక్షేత్రంలో నంద్యాల జిల్లా న్యాయమూర్తి డి.అమ్మన్న రాజా కుటుంబ సభ్యులతో పూజలు నిర్వహించారు. శనివారం వీరికి ఏఈవో మధు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. శ్రీ కామేశ్వరి దేవి సహిత మహానందీశ్వర స్వామి అమ్మవార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన, తదితర పూజలు నిర్వహించుకున్నారు. పూజల అనంతరం ఏఈఓ శేష వస్త్రాలతో సత్కరించగా, వేద పండితులు వేద ఆశీర్వచనాలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు.

విద్యతో పాటు క్రమశిక్షణ, క్రీడలకు సమ ప్రాధాన్యత ఇవ్వాలి

పిల్లల భవిష్యత్తుపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి సారించాలి

-సెయింట్ జోసెఫ్ కళాశాలలో జరిగిన బాలల దినోత్సవ వేడుకల్లో మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి

బనగానపల్లె నవంబర్ 14,పల్లెవెలుగు కర్నూలు



నగరంలోని సెయింట్ జోసెఫ్ కళాశాలలో శనివారం రాత్రి నిర్వహించిన బాలల దినోత్సవ వేడుకలు--2026కు రాష్ట్ర మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. దాదాపు 12 వేల మందికి పైగా విద్యార్థులు, 800 మందికి పైగా ఉపాధ్యాయులు, సిబ్బందితో సెయింట్ జోసెఫ్ విద్యాసంస్థలు మహా వృక్షంగా ఎదగడం అభినందనీయమని మంత్రి అన్నారు. సెయింట్ జోసెఫ్, సిస్టర్స్ ఆఫ్ చారిటీ సంస్థలు క్రమశిక్షణ, బాధ్యతాయుత నిర్వహణతో విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాదులు వేస్తున్నాయని ప్రశంసించారు. విద్యను వ్యాపారంగా కాకుండా సామాజిక బాధ్యతగా భావించి, ఆర్థిక స్థోమత లేని పేద విద్యార్థుల కోసం తెలుగు మీడియం పాఠశాలను ఏర్పాటు చేసి ఉచితంగా విద్య అందించడం గొప్ప సేవగా అభివర్ణించారు. వెనుకబడిన వర్గాలకు విద్యను చేరువ చేస్తున్న యాజమాన్యానికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

ప్రతి విద్యార్థికి జీవితంలో ఒక లక్ష్యం ఉండాలి

పిల్లలే దేశ భవిష్యత్తు అని, నేటి విద్యార్థులే రేపటి వైద్యులు, ఇంజనీర్లు, ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, నాయకులుగా ఎదుగుతారని మంత్రి పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని, దాని సాధన కోసం కష్టపడి చదవాలని సూచించారు. విద్యతో పాటు క్రీడలకు సమాన ప్రాధాన్యత ఇవ్వాలని, క్రీడలు శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించడంతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలను అలవర్చుతాయని వివరించారు. గెలుపోటములను సమానంగా స్వీకరించడం, జట్టుగా పనిచేయడం వంటి విలువలు క్రీడల ద్వారా అలవడతాయని తెలిపారు.సెల్‌ఫోన్లకు బానిసలు కావద్దు

ప్రపంచ స్థాయి పోటీలను తట్టుకుని విద్యార్థులు గ్లోబల్ సిటిజన్లుగా ఎదగాలంటే అనవసరమైన సెల్‌ఫోన్ వినియోగానికి దూరంగా ఉండాలని మంత్రి సూచించారు. సెల్‌ఫోన్లకు అతిగా అలవాటుపడటం వల్ల చదువుతో పాటు పిల్లల ప్రవర్తన, మానసిక ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. భోజనం చేయడానికి సైతం సెల్‌ఫోన్ అవసరమయ్యే పరిస్థితులు ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు.

పిల్లల కోసం తల్లిదండ్రులు రోజూ 10 నుంచి 15 నిమిషాలు కేటాయించాలి

ఉద్యోగాలు, వ్యాపారాలు, ఇతర పనుల్లో ఎంత బిజీగా ఉన్నా తల్లిదండ్రులు తమ పిల్లల కోసం ప్రతిరోజూ కనీసం 10 నుంచి 15 నిమిషాలు కేటాయించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. వారి చదువు, ప్రవర్తన, స్నేహాలు, అలవాట్లను గమనిస్తూ సరైన మార్గనిర్దేశం చేయాలని సూచించారు. తల్లిదండ్రుల పర్యవేక్షణ, కుటుంబ విలువలు, పెద్దల సూచనలు పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. పిల్లల ఎదుగుదలపై నిర్లక్ష్యం వహించకుండా వారితో ప్రతిరోజూ మాట్లాడాలని, చెడు అలవాట్లకు దూరంగా ఉంచేలా బాధ్యత తీసుకోవాలని కోరారు.

నా కుమారుడి విజయానికి సెయింట్ జోసెఫ్‌లో నేర్చుకున్న క్రమశిక్షణే పునాది

సెయింట్ జోసెఫ్ విద్యాసంస్థతో తన కుటుంబానికి ఉన్న అనుబంధాన్ని మంత్రి ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. తన కుమారుడు మనోహర్ రెడ్డిని ఈ పాఠశాలలో చేర్పించే సమయంలో ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన వారికే సీటు ఇస్తామని, ఎలాంటి సిఫార్సులకూ అవకాశం లేదని యాజమాన్యం స్పష్టం చేసిందని తెలిపారు. క్రమశిక్షణకు సంస్థ ఎంతటి ప్రాధాన్యత ఇస్తుందో ఈ సంఘటన తెలియజేస్తుందన్నారు.

తన కుమారుడు ఒకటో తరగతి నుంచి నాలుగో తరగతి వరకు ఈ పాఠశాలలోనే చదువుకున్నారని, ఇక్కడ నేర్చుకున్న క్రమశిక్షణ, విలువలే ఆయన ఎదుగుదలకు పునాదిగా నిలిచాయని గర్వంగా పేర్కొన్నారు. ప్రస్తుతం తన కుమారుడు హైదరాబాద్‌లోని జేఆర్‌సీ కన్వెన్షన్ సెంటర్‌తో పాటు నిర్మాణ రంగంలోనూ గుర్తింపు పొందుతూ, తన సంస్థ ద్వారా 600 మందికి పైగా ఉపాధి కల్పించడం ఆనందంగా ఉందన్నారు. చిన్నతనంలోనే క్రమశిక్షణను అలవర్చిన సెయింట్ జోసెఫ్ యాజమాన్యానికి ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

65 ఏళ్ల విద్యా ప్రస్థానం అభినందనీయం

గత 65 సంవత్సరాలుగా విద్యా, సాంస్కృతిక, క్రీడా రంగాల్లో విశేష విజయాలు సాధిస్తూ ముందుకు సాగుతున్న సెయింట్ జోసెఫ్ విద్యాసంస్థలు భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని మంత్రి ఆకాంక్షించారు. విద్యార్థులు ఉపాధ్యాయుల మార్గదర్శకత్వంలో క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని, తమ తల్లిదండ్రులకు, విద్యాసంస్థకు, కర్నూలు జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని పిలుపునిచ్చారు. బాలల దినోత్సవం సందర్భంగా విద్యార్థులందరికీ శుభాకాంక్షలు తెలిపారు.

టీడీపీలో యువతకు పెద్దపీట.


వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలోకి దళిత యువ నాయకుడు బసవరాజు.

ఆదోని (పల్లె వెలుగు): తెలుగుదేశం పార్టీలో



యువతకు ప్రత్యేక ప్రాధాన్యత కల్పిస్తూ, రాబోయే రోజుల్లో యువ నాయకత్వాన్ని మరింత ప్రోత్సహిస్తామని టీడీపీ సీనియర్ నాయకులు కొంకా ఉమాపతి నాయుడు తెలిపారు. ఆదోని మండలం చాగి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ దళిత యువ నాయకుడు మాదిగ బసవరాజు శనివారం తెలుగుదేశం పార్టీలో చేరారు. టీడీపీ సిద్ధాంతాలపై నమ్మకంతో పాటు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను స్ఫూర్తిగా తీసుకుని ఆయన అడుగుజాడల్లో నడిచేందుకు పార్టీలో చేరినట్లు బసవరాజు తెలిపారు. అలాగే యువ నాయకుడు చెన్నంపల్లి మారుతి నాయుడు స్ఫూర్తితో టీడీపీలోకి వచ్చానని, గ్రామంతో పాటు ఆదోని మండల ప్రజలకు సేవ చేయాలనే దృఢ సంకల్పంతో పనిచేస్తానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా బసవరాజుకు టీడీపీ సీనియర్ నాయకులు కొంకా ఉమాపతి నాయుడు, రంగస్వామి నాయుడు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఉమాపతి నాయుడు మాట్లాడుతూ టీడీపీలో యువతకు ప్రత్యేక స్థానం ఉంటుందని, రాబోయే రోజుల్లో యువతకు పెద్దపీట వేస్తామని అన్నారు. పార్టీలో చేరిన బసవరాజుకు, ఆయన కుటుంబానికి టీడీపీ ఎల్లవేళలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర బీసీ నాయకులు చాగి మల్లికార్జున రెడ్డి, టీడీపీ నాయకులు రాము, మూలంటి గులేప్ప, కాబోయే మండల అధ్యక్షుడు గోనహాళ్ గోపాలరెడ్డి, రాతన రంగన్నతో పాటు పలువురు సీనియర్ నాయకులు, గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీ సూర్యనారాయణ స్వామి ఆలయంలో విశేష రుద్రాభిషేకాలు



పల్లె వెలుగు కర్నూలు బ్యూరో పవిత్ర కార్తీక మాసం సందర్భంగా శనివారం కర్నూలులోని శ్రీ సూర్యనారాయణ స్వామి వారి దేవాలయంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. శ్రీ గణపతి సచ్చిదానంద స్వామి వారి దివ్య ఆశీస్సులతో ఆలయంలోని గౌరీ శంకర స్వామి వారికి ప్రాతఃకాలంలో వేద పండితులు శాస్త్రోక్తంగా లఘున్యాస పూర్వక రుద్రాభిషేకాలు, విశేష అర్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

గురుకుల పాఠశాలలో ఘనంగా బాలల దినోత్సవం, ఆయుష్ వైద్య శిబిరం

కారంపూడి, నవంబర్ 14 మండలంలోని డాక్టర్ బి.ఆర్.కె.ఆర్. బాలుర గురుకుల పాఠశాలలో ప్రిన్సిపల్ వన్‌పాల్ రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ రత్నకుమారి ఆధ్వర్యంలో శనివారం బాలల దినోత్సవ వేడుకలు, ఆయుష్ వైద్య శిబిరాన్ని ఘనంగా నిర్వహించారు, ముఖ్య అతిథులుగా హాజరైన డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ పద్మజ, నెట్ జీరో కోఆర్డినేటర్ నందన, ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ ఆర్. శ్రీనివాస్, ఏఎస్ఐ వెంకటరెడ్డి మాట్లాడుతూ, నేటి బాలలే రేపటి నవభారత నిర్మాతలని, విద్యార్థుల కలలకు రెక్కలు తొడిగి విద్య, విజ్ఞానం, సంస్కారంతో కూడిన బంగారు భవిష్యత్తును అందించడం అందరి బాధ్యతని పేర్కొన్నారు, అనంతరం డాక్టర్ ఆర్. శ్రీనివాస్ ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధుల నివారణపై అవగాహన కల్పించి, విద్యార్థుల్లో వ్యాధి నిరోధక శక్తిని పెంచే ఆయుష్ మందులను ఉచితంగా అందజేశారు, వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేయడంతో పాటు ముఖ్య అతిథులను ప్రిన్సిపల్ శాలువా, మెమెంటోలతో సత్కరించారు, కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటాచారి, ఉషారాణి, డాక్టర్ దస్తగిరి, హెల్త్ సూపర్‌వైజర్ మస్తాన్‌వలి, యోగా టీచర్ జి. నరసింహారావు, కాంపౌండర్ ఎస్. లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీకి మద్దతుగా ఎన్నికల్లో తిరగడమే షఫీ చేసిన తప్పా,,,,,,

● పేదల ఇళ్లను కూల్చి ఏం సాధించారు,,,,, ● షఫీ కుటుంబానికి న్యాయం చేయాలి,,,,, ● ఇల్లు లేదా మూడు సెంట్ల స్థలం కేటాయించాలి,,,,, ● ఎర్రకోట రాజీవ్ రెడ్డి,,

ఎమ్మిగనూరు పల్లె వెలుగు నవంబర్ 13





ఎమ్మిగనూరు పట్టణంలోని 44వ వార్డుకు చెందిన షఫీ కుటుంబం నివాసముంటున్న రేకుల షెడ్డును కూల్చివేసి ఆ కుటుంబాన్ని నిరాశ్రయులుగా మార్చిన ఘటనపై వైఎస్సార్‌సీపీ ఎమ్మిగనూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎర్రకోట రాజీవ్ రెడ్డి తీవ్రంగా స్పందించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.

కేవలం వైఎస్సార్‌సీపీ పార్టీకి మద్దతుగా ఎన్నికల్లో ప్రచారం చేయడం, పార్టీ కోసం పనిచేయడమే షఫీ చేసిన తప్పా? ఒక రాజకీయ పార్టీకి మద్దతుగా నిలిచినందుకు ఒక పేద కుటుంబాన్ని రోడ్డున పడేయడమేనా ప్రజాస్వామ్యంలో మీరిచ్చే రక్షణ? అని రాజీవ్ రెడ్డి ప్రశ్నించారు.

ప్రజాస్వామ్యంలో ప్రజలకు రక్షణ కరువైందని, అధికారాన్ని అడ్డం పెట్టుకుని పేద, మధ్యతరగతి కుటుంబాలను ఇబ్బందులకు గురిచేస్తూ, వారి నివాసాలను కూల్చివేసి పైశాచిక ఆనందం పొందడం ఎంతవరకు సమంజసమని కూటమి నేతలను నిలదీశారు. రాజకీయ కక్షలు ఉంటే రాజకీయంగానే ఎదుర్కోవాలి కానీ, పేదల కుటుంబాల జీవనాధారాన్ని, నిలువ నీడను దెబ్బతీయడం ఏ విధమైన న్యాయం? ఒక కుటుంబం రోడ్డున పడితే దానికి బాధ్యత ఎవరు వహిస్తారుషఫీ కుటుంబానికి తక్షణమే ప్రత్యామ్నాయంగా నివాసయోగ్యమైన ఇల్లు లేదా మూడు సెంట్ల స్థలాన్ని కేటాయించాలని, బాధిత కుటుంబంతో కలిసి మున్సిపల్ కమిషనర్ దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లి న్యాయం జరిగే వరకు పోరాడతామని స్పష్టం చేశారు.

ఈ రోజు అధికారం మీది కావచ్చు.. కానీ రాబోయే రోజుల్లో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు ఎలాంటి అన్యాయం జరగకుండా వారిని ఎలా కాపాడుకోవాలో, వారి వెనుక ఎలా నిలబడాలో మాకు బాగా తెలుసు. మా కార్యకర్తలను ఒంటరిగా వదిలిపెట్టే ప్రసక్తే లేదు! అని రాజీవ్ రెడ్డి హెచ్చరించారు. అధికారం శాశ్వతం కాదు.. ప్రజల అభిమానం, ప్రజాస్వామ్య విలువలే శాశ్వతం. పేదవాడి కన్నీటికి సమాధానం చెప్పాల్సిన బాధ్యత అధికారంలో ఉన్నవారిపై ఉంటుంది.


షఫీ కుటుంబానికి న్యాయం జరిగే వరకు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుంది ఈ కార్యక్రమంలో పట్టణ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బీపీ అప్ అండ్ డౌన్ అవుతోందా?

మందులు లేకుండా సహజంగా కంట్రోల్ చేసే అద్భుత చిట్కాలు ఇవే!

నంద్యాల ఆరోగ్య శాఖ నవంబర్ 14:-

ప్రస్తుత కాలంలో రక్తపోటు (BP) అనేది ప్రతి ఇంట్లో ఒక సాధారణ ఆరోగ్య సమస్యగా మారింది. బీపీ స్థాయిలు పెరిగినా (High BP) లేదా తగ్గినా (Low BP) అది ప్రాణాలకే ప్రమాదంగా మారవచ్చు.



బీపీ హెచ్చుతగ్గుల వల్ల కలిగే నష్టాలు:

హై బీపీ (High BP): గుండెపోటు, పక్షవాతం, కిడ్నీల వైఫల్యం మరియు కంటి చూపు దెబ్బతినే ప్రమాదం ఉంది.

లో బీపీ (Low BP): అకస్మాత్తుగా కళ్లు తిరిగి పడిపోవడం, నీరసం, మెదడుకు రక్త ప్రసరణ తగ్గి స్పృహ కోల్పోవడం వంటివి జరుగుతాయి.

కంట్రోల్‌లో ఉంటే లాభాలు: బీపీ సాధారణ స్థాయిలో (120/80 mmHg) ఉంటే గుండె ఆరోగ్యంగా ఉండి, శరీరం రోజంతా ఉత్సాహంగా పనిచేస్తుంది.

బీపీని సహజంగా నియంత్రించుకునే మార్గాలు:

ఆహార నియమాలు: ఉప్పు (సోడియం) వాడకం తగ్గించాలి. పొటాషియం ఎక్కువగా ఉండే అరటిపండ్లు, ఆకుకూరలు, కొబ్బరి నీళ్లు తీసుకోవాలి. లో బీపీ ఉన్నవారు తగినంత నీరు, ఉప్పు కలిపిన మజ్జిగ తాగాలి.

వ్యాయామం & యోగా: ప్రతిరోజూ కనీసం 30 నిమిషాల పాటు నడక (Walking), ప్రాణాయామం మరియు ధ్యానం చేయడం వల్ల ఒత్తిడి తగ్గి బీపీ అదుపులోకి వస్తుంది.

ఆయుర్వేద & ఇంగ్లీష్ వైద్యం: ఆయుర్వేదంలో అశ్వగంధ, సర్పగంధ, వెల్లుల్లి వంటివి బీపీ నియంత్రణకు ఎంతో మేలు చేస్తాయి. అయితే, సమస్య తీవ్రంగా ఉన్నప్పుడు సొంత వైద్యం కాకుండా, తప్పనిసరిగా డాక్టర్ సలహా మేరకు ఇంగ్లీష్ మందులు వాడటం సురక్షితం.

ముమ్మరంగా కూటమి సర్పంచ్ అభ్యర్థి

పాండ్రంగి సురేఖ రాంబాబు ప్రచారం

జగ్గంపేట, నవంబర్ 14 తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి బలపరిచిన జగ్గంపేట సర్పంచ్ అభ్యర్థి పాండ్రంగి సురేఖ రాంబాబు ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్నారు. శనివారం ఉదయం గద్దపేటలో ఇంటింటి ప్రచారాన్ని ప్రారంభించిన ఆయన, మధ్యాహ్నం వరకు ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు.



అనంతరం శెట్టిబలిజిపేట రామాలయం వద్ద నుండి రాత్రి వరకు నిర్విరామంగా ప్రచారం సాగించి ప్రజల ఆశీస్సులు అందుకున్నారు. ఈ సందర్భంగా సురేఖ రాంబాబు మాట్లాడుతూ జగ్గంపేటలో దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించడంలో తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. స్థానిక ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ సహకారంతో ప్రత్యేక నిధులను సమకూర్చుకుని అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధం చేస్తామని తెలిపారు. కొద్దిపాటి వర్షానికే ముంపునకు గురవుతున్న అంబేద్కర్ కాలనీని పరిరక్షించడానికి డ్రైనేజ్ వ్యవస్థను మెరుగుపరుస్తామన్నారు. త్రాగునీటి సమస్యను పరిష్కరించి 18 వార్డుల్లోనూ ఏలేరు రక్షిత మంచినీటిని అందిస్తామని, రైతు బజార్ ఏర్పాటుతో జగ్గంపేట సంత మార్కెట్‌కు నూతన కళ తీసుకువస్తామని వెల్లడించారు. పంచాయతీ ఆదాయాలను పెంచే ప్రణాళికలతో పాటు మంచినీటి చెరువుగట్టు చుట్టూ వాకింగ్ ట్రాక్, పిల్లల ఆటస్థలం ఏర్పాటు చేస్తామన్నారు. గత 30 ఏళ్లుగా జగ్గంపేటలో నిస్వార్థ సేవకుడిగా సురేఖ రాంబాబుకు పేరుంది. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్‌గా ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే పేదలకు మెరుగైన వైద్యం, మౌలిక వసతులు కల్పించడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. కరోనా సమయంలో సొంత ఖర్చులతో బాధితులకు నిత్యావసరాలు అందించారు. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, జిల్లా టీడీపీ అధ్యక్షులు జ్యోతుల నవీన్‌కు నమ్మకమైన అనుచరుడిగా గుర్తింపు పొందారు. ఆయన సుదీర్ఘ సేవా ప్రస్థానం విజయానికి బాటలు వేస్తుందని ప్రజలు విశ్వసిస్తున్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి జీనుమణి బాబు, ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, దేవరపల్లి మూర్తి, వేములకొండ జోగారావు, కేంగం రామకృష్ణ, మారిశెట్టి గంగ, కొండ్రోతు శ్రీను, ఆశీర్వాద రియల్ ఎస్టేట్ రాజు, గెడ్డమూరి బాబ్జి, సాంబతుల చంద్రశేఖర్, సందక శంకర్, కంది తాతాజీ, మోరుకుర్తి రాజు, హరి గోపాల్, కారుముజ్జి రామకృష్ణ, సందక రాంబాబు, మహిళలు, కూటమి నాయకులు పాల్గొన్నారు

మీ-సేవ కేంద్రాల్లో అక్రమ వసూళ్లకు

పాల్పడితే లైసెన్సులు రద్దు చేస్తాం

అమలాపురం, నవంబర్ 14 ప్రజలకు ప్రభుత్వ సేవలను పారదర్శకంగా, నిర్ణీత ధరలకు అందించడమే మీ-సేవ కేంద్రాల ప్రధాన లక్ష్యమని, ఈ విషయంలో నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని జిల్లా స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు అధికారి వి. విజయలక్ష్మి స్పష్టం చేశారు. శనివారం అమలాపురం మండలం జనుపల్లి గ్రామంలోని మీ-సేవ కేంద్రాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రాల్లో అందిస్తున్న సేవలు, నిర్వహిస్తున్న రికార్డులు, ప్రభుత్వ మార్గదర్శకాల అమలు తీరును పరిశీలించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే అధికంగా వసూలు చేయడం, మీ-సేవ పేరుతో అక్రమాలకు పాల్పడటం వంటి చర్యలను ఎంతమాత్రం సహించబోమని హెచ్చరించారు. ఇటువంటి ఉల్లంఘనలు గుర్తిస్తే సంబంధిత కేంద్రాల లైసెన్సులు రద్దు చేయడంతో పాటు నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రతి మీ-సేవ కేంద్రం నిర్దేశించిన ప్రాంతంలోనే నిర్వహించాలని, సేవలకు సంబంధించిన రికార్డులను ఎప్పటికప్పుడు సంబంధిత ప్రభుత్వ కార్యాలయాలకు పంపాలని సూచించారు. ప్రజలకు అందించే ప్రతి సేవలో పారదర్శకత, జవాబుదారీతనం ఉండాలని నిర్వాహకులకు ఆదేశించారు. ప్రజల ఫిర్యాదులకు కలెక్టరేట్‌లో వేదిక.. మీ-సేవ కేంద్రాల నిర్వాహకులు ఎప్పుడైనా అక్రమాలకు పాల్పడినా, నిర్ణీత ధరలకు మించి డబ్బులు వసూలు చేసినా ప్రజలు నిశ్శబ్దంగా ఉండాల్సిన అవసరం లేదని ఆమె తెలిపారు. అమలాపురంలోని జిల్లా కలెక్టరేట్‌లో ఉన్న స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు కార్యాలయాన్ని నేరుగా సందర్శించి తమ ఫిర్యాదులు, వినతులను సమర్పించవచ్చని సూచించారు. ప్రజలకు అందాల్సిన ప్రభుత్వ సేవలు ఎలాంటి ఇబ్బందులు, అదనపు ఆర్థిక భారం లేకుండా సక్రమంగా అందేలా నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తామని ఆమె పేర్కొన్నారు. ఆమె వెంట స్వర్ణ గ్రామ స్వర్ణ వార్డ్ జిల్లా కోఆర్డినేటర్ సువిజయ్ సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు



రుద్రవరం ఒకటవ ఎంఈఓ గా కృష్ణమూర్తి బాధ్యతలు



రుద్రవరం. పల్లె వెలుగు : రుద్రవరం మండలం విద్యాశాఖ ఒకటవ ఎంఈఓ గా కే కృష్ణమూర్తి శనివారం బాధ్యతలు చేపట్టారు. జిల్లా కేంద్రమైన నంద్యాలలోని గవర్నమెంట్ గర్ల్స్ హై స్కూల్లో స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ సైన్స్ గా విధులు నిర్వహిస్తున్న కృష్ణమూర్తిని విద్యాశాఖ ఉన్నతాధికారులు రుద్రవరం మండల విద్యాశాఖ అధికారిగా నియమించడంతో ఆయన కార్యాలయంలో ఎంపీడీవో భాగ్యలక్ష్మిని కలిసి జాయినింగ్ లెటర్ అందజేసి రుద్రవరం మండల విద్యాశాఖ అధికారిగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల అభివృద్ధి, విద్యార్థుల విద్యాభివృద్ధి కొరకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఆయనతోపాటు రెండవ ఎంఈఓ లక్ష్మి ఎమ్మార్సీ సిబ్బంది ఉన్నారు.

ఎన్నికల నామినేషన్ల స్వీకరణపై శిక్షణ

రుద్రవరం. పల్లె వెలుగు : స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో శనివారం పంచాయతీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ పై ఆర్వోలు ఏఆర్వోలు డిజిటల్ అసిస్టెంట్లు



వెల్ఫేర్ అసిస్టెంట్లకు ఎంపీడీవో భాగ్యలక్ష్మి శిక్షణ ఇచ్చారు. రుద్రవరం మండలంలో నేటి నుండి ప్రారంభం కానున్న పంచాయతీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణకు సంబంధించిన విధి విధానాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్లు ఎంపీడీవో తెలిపారు. మండలంలో నామినేషన్ల స్వీకరణకు 7 క్లస్టర్లు ఏర్పాటు చేశామని, ఒక్కో క్లస్టర్ లో ఒక ఆర్ఓ, ఒక ఏఆర్ఓ, డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్, పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది విధులు నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీవో తెలిపారు. 7 క్లస్టర్లలో ఎన్నికలలో పోటీ చేసే సర్పంచ్ అభ్యర్థులు వార్డు మెంబర్ల అభ్యర్థుల నుండి వచ్చే నామినేషన్లను స్వీకరించి ఆన్లైన్లో నమోదు చేసే విధివిధానాలపై శిక్షణలో వివరించడం జరిగిందన్నారు. నామినేషన్ల ప్రక్రియ నిష్పక్షపాతంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఆర్వోలు ఏఆర్వోలకు సూచించామని ఎంపీడీవో తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఆర్వోలు ఏఆర్వోలు లెక్చరర్లు ఉపాధ్యాయులు, డిజిటల్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

రాంబోట్ల దేవాలయం వద్ద శ్రీ కాళికామాత అమ్మవారిని దర్శించుకున్న మంత్రి టీజీ భరత్



పల్లె వెలుగు కర్నూలు బ్యూరో కర్నూలు నగరంలోని రాంబోట్ల దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన శ్రీ కాళికామాత అమ్మవారి విగ్రహాన్ని రాష్ట్ర మంత్రి టీజీ భరత్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కర్నూలు ప్రజలతో పాటు రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు.

ఘనంగా బాలసదనంలో బాలల దినోత్సవం

ఆళ్లగడ్డ ప్రతినిధి నవంబర్ 14, పల్లె వెలుగు ఆళ్లగడ్డ పరిధిలోని బాలసదనంలో శనివారం బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ నోడల్ అధికారిని ఉమామహేశ్వరమ్మ, జిల్లా బాలల సంరక్షణ అధికారిణి స్వప్న ప్రియదర్శిని, సంరక్షణ అధికారి శ్రీనివాస్, మెడికల్ ఆఫీసర్ డా.సింధియా, ఐసిడిఎస్ సూపర్వైజర్ దస్తగిరమ్మ హాజరై నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ పిల్లలు క్రమశిక్షణతో కూడిన మంచి అలవాట్లను అలవర్చుకోవాలన్నారు. అలాగే బాగా చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని వారు తెలిపారు. అనంతరం పిల్లలకు మెడికల్ ఆఫీసర్ పిల్లలకు కావాల్సిన వ్యక్తిగత వస్తువులను కిట్టు ద్వారా అందించి, స్వీట్స్ పంచిపెట్టారు.



Printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 EDITOR; M Mahesh Babu RNI No: APTEL/2012/46499Phone No :-9849499960,9059696959 Email id: Pallevelugunews9@gmail.com